గురువారం
1-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 219
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీంలో తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు అంశం సుప్రీంకోర్టు దాకా చేరింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టి...తీర్పును రిజర్వు చేసింది. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కే పురుషోత్తం రెడ్డి సుప్రీంకోర్టులో

- మిగతా 2 లో

పీవోకే ఆక్రమణే కశ్మీర్‌కు పరిష్కారం

లండన్: పహల్గాం ఉగ్రదాడిపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటీష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (పీఓకే) పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి ఆయన సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండటానికి భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్

- మిగతా 2 లో

సిసోదియా, జైన్‌పై ఏసీబీ కేసు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌లపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. ఆప్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో 12 వేల తరగతి గదులు, పాఠశాల భవనాల నిర్మాణంలో రూ. రెండు వేల కోట్ల అక్రమాలు జరిగినట్లు బయటపడింది. సిసోదియా, జైన్ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు వీరిద్దరిపై కేసులు బుక్ చేశారు. ఈ కుంభకోణంలో ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ల పాత్రపై కూడా దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కులగణనకు ఓకే

- జనాభా లెక్కలతో పాటే...
- కేంద్ర కేబినెట్ నిర్ణయం
- చెరకు మద్దతు ధర క్వింటా రూ.350
- రూ.22 వేల కోట్లతో షిల్లాంగ్-సిల్చారు ఎన్‌హెచ్ నిర్మాణం

న్యూఢిల్లీ: దేశంలో కులగణన నిర్వహించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు కేంద్రం తలొగ్గింది. దేశవ్యాప్త కులగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక కాలం ఏర్పాటు చేస్తారు. పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై చర్చించేందుకు బుధవారం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ) సమావేశమైందని, ఈ సందర్భంగా దేశంలో జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు కులగణన చేపట్టాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వాటిలో కొన్ని రాష్ట్రాలు రాజకీయ సాధనంగా కులగణనను వాడుకున్నాయని ఆరోపించారు. కాగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తం కులగణన చేపట్టాలంటూ ఇండియా ఐక్యసంఘటన డిమాండ్ చేస్తున్న సంగతి విదితమే. అయితే ఆ డిమాండ్‌ను ఇన్ని రోజులుగా కేంద్రం పక్కన పెడుతూ వస్తోంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న తరుణంలో మోదీ సర్కారు పాక్‌కు ఏవిధంగా గుణపాఠం చెప్పనుందోనని దేశం యావత్తు ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రమంలో కులగణనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలుపడం సంచలనంగా మారింది. బీహార్, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోదీ సర్కారు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 2019లోనే జనగణన చేయాల్సి ఉన్నప్పటికీ కరోనా కారణంగా అప్పుడు ముందడుగు పడలేదు. ఇక కేంద్ర కేబినెట్ తీసుకున్న మరికొన్ని నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. షిల్లాంగ్-సిల్చారు జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.22,864 కోట్ల ఖర్చుతో 166 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా త్రిపుర, మిజోరం, మణిపూర్, అసోంలోని బరాక్ లోయకు కనెక్టివిటీ పెరగనుంది. అదే సమయంలో చెరకు మద్దతు ధర క్వింటా రూ. 350కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యతిరేకం: అశ్వినీ వైష్ణవ్

కుల గణన కోసం ఎన్నో ఏళ్లుగా బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరిగిన అన్ని జనాభా గణన కార్యకలాపాలలో కులాన్ని

- మిగతా 2 లో

రాహుల్ హర్షం

- ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలని డిమాండ్
- తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మొత్తం జనాభా లెక్కలతో పాటు కులాల వారీగా కూడా జనగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ఇది లోతైన సామాజిక సంస్కరణవైపు

- మిగతా 2 లో

జాతీయ భద్రతా సలహా బోర్డు పునరుద్ధరణ

- చైర్మన్ అలోక్ జోషీ, మరో ఆరుగురు సభ్యులు
- పాక్‌తో ఉద్రిక్తతల వేళ కేంద్రం నిర్ణయం

8 లో

కార్మిక వర్గానికి మేడే శుభాకాంక్షలు

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ప్రతిపక్షాల విజయం కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్: జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించడం ప్రతిపక్షాల విజయమని, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇప్పటికే సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టి తెలంగాణ రాష్ట్రం మార్గదర్శిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీసీ జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ పెంపుపై రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఆయన కోరారు.

నియంతలకు, పెట్టుబడిదారులకు మోకరిల్లం

2 లో

ప్రజల మేలే లక్ష్యం

- పాలకపక్ష లోపాలు ఎత్తిచూపేందుకే ప్రతిపక్షం
- అభివృద్ధి...సంక్షేమంపై చర్చకు సిద్ధమా
- పాలనలో బసవేశ్వరుడే స్ఫూర్తి
- జయంతి సభలో సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం చేయాల్సింది ప్రజలే అని, ఒక విధంగా చెప్పాలంటే వాళ్లే తమ బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో బుధవారం బసవేశ్వరుడి జయంతి సభ జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి సీఎం హాజరయ్యారు. బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడని, ఆయన జయంతి రోజున పదోతరగతి ఫలితాలు విడుదల

- మిగతా 2 లో

ధాన్యం కొనుగోలుకు రూ.15 వేల కోట్లు

- రబీలో 127 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు సిద్ధం
- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: యాసంగిలో పండిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రూ.15 వేల కోట్లు విడుదల చేసిందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం దిగుబడిలో యావత్ భారతదేశంలోనే రికార్డ్ సృష్టించిన తెలంగాణ... రబీ లోనూ అదే రికార్డ్ సృష్టించ బోతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని పౌర సరఫరాలశాఖ కేంద్ర కార్యాలయం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పై మంత్రి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లపై రూపొందించిన విధివిధానాలను పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ... యాసంగిలో 54.89 లక్షల ఎకరాలు సాగు చేయగా 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. 70 లక్షల మెట్రిక్

- మిగతా 2 లో

భద్రతా బలగాల చేతికి కర్రెగుట్ట

- త్రివర్ణ పతాకం రెపరెపలు
- కొండపై బేస్ క్యాంప్ ఏర్పాటుకు నిర్ణయం

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేష న్‌లో బుధవారం కీలక పరిణామం చోటుచేసు కుంది. చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని మావోయిస్టుల అధీనం గల కర్రెగుట్ట కొండను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అదేసమయంలో కర్రెగుట్టలపై

- మిగతా 2 లో

బాలికలదే హవా

విశాలాంధ్ర - హైదరాబాద్: పదో తరగతి పరీక్షల్లో మరోసారి బాలికలు తమ సత్తా చాట్టారు. మొత్తం 92.78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 94.26 శాతం కాగా, బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే 2.94 శాతం అధికశాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందు వరుసలో నిలిచారు. ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ముఖ్యంగా గురుకుల విద్యార్థులు అగ్రస్థానంలో

- మిగతా 2 లో

- 'పది'లో 92.78 శాతం ఉత్తీర్ణత
- 99.29 శాతంతో మహబూబాబాద్ టాప్
- 73.97 శాతంతో వికారాబాద్ చివరిస్థానం
- జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఫలితాల విడుదల



వియత్నాం విజయోత్సవం

- అమెరికాతో యుద్ధం ముగిసి 50 ఏళ్లు
- ఎరుపెక్కిన హో చి మిన్ నగరం
- ఘనంగా వేడుకలు - ఆకట్టుకున్న సైనిక పరేడ్
- పాల్గొన్న కంబోడియా, లావోస్, వియత్నాం దళాలు

హోచిమిన్ సిటీ: అమెరికాతో యుద్ధం ముగిసి... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం ఏకీకరణ జరిగి బుధవారానికి అంటే ఏప్రిల్ 30వ తేదీకి 50 ఏళ్లు అయ్యాయి. ఈ సందర్భంగా వియత్నాం అట్టహాసంగా వేడుకలు నిర్వహించింది. చారిత్రక హో చి మిన్ నగరం ఎరుపెక్కింది. నగర వీధులన్నీ జనంతో కోలాహలంగా మారాయి. జాతీయ పతాకాలతో ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. తమ అభిమానాన్ని చాటుకున్నారు. వియత్నాం విప్లవ యోధుడు హో చి మిన్ చిత్ర పటం, వియత్నాంకు చిహ్నం 'ల్యాక్ బర్డ్'తో సైన్యం కదం తొక్కారు. హో చి మిన్ నగర వీధుల్లో పరేడ్ ముందుకు సాగగా, దానిని వీక్షించేందుకు వేలాది సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. ఈ సందర్భంగా శాంతిపై దృష్టితో ముందుకెళు తున్నట్లు నాయకులు సందేశమిచ్చారు. ఒకప్పుడు సైగన్‌గా పిలిచే హో చిమిన్ నగర వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. పరేడ్‌ను వీక్షించేందుకు తరలి వచ్చిన బ్లాక్ కాఫీ ఆస్వాదిస్తూ... తమ ముఖాలపై వియత్నాం జెండా బొమ్మలతో సందడి చేశారు. పరేడ్‌లో చైనా, లావోస్, కంబోడియా, వియత్నాం సైనిక దళాలు పాల్గొన్నాయి. యుద్ధం సమయంలో ఉత్తర వియత్నాం దళాలు ధరించిన యూనిఫారంతో కొందరు పరేడ్‌లో పాల్గొన్నారు. జాతీయ జెండా ప్రదర్శిస్తూ హెలికాప్టర్లు గాల్లో చక్కర్లు కొట్టగా... యుద్ధానికి ముగింపు పలికిన చోటు 'ఇండిపెండెన్స్ ప్యాలెస్' వద్ద యుద్ధ విమానాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కంబోడియా మాజీ నాయకుడు హున్ సెన్, లావోటియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి తోంగ్లున్ సిసౌలిత్,

- మిగతా 2 లో

8న రష్యాలో స్టాలిన్ విగ్రహావిష్కరణ

మాస్కో: సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ సన్మానార్థం రష్యాలోని మొజాయిస్క్ పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రష్యా రాజధాని మాస్కోకు పశ్చిమాన 100 కిమీల దూరంలోని మొజాయిస్క్ పట్టణంలోని గ్లోరీ స్క్వేర్‌లో స్టాలిన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మే 8వ తేదీ ఉదయం 11 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) స్టాలిన్ విగ్రహావిష్కరణ జరుగుతుందని వెల్లడించింది. జోసెఫ్ స్టాలిన్ విప్లవయోధుడు. సోవియట్‌కు అందించిన సేవలకుగాను ఆయన రష్యా ప్రజలకు చిరస్మరణీయుడు. గత దశాబ్దంగా కమ్యూనిస్టు-సోవియెట్ వ్యతిరేక ప్రచారం సాగినప్పటికీ రష్యా ప్రజలు, ముఖ్యంగా కార్మికుల్లో స్టాలిన్‌పై గౌరవం, అభిమానం ఏ మాత్రం తగ్గలేదు.

వియత్నాం విజయోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్ తదితరులు హాజరయ్యారు. టూ లామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన 30 ఏళ్ల పోరాటం ముగింపునకు, వలసవాదం అంతానికిగాను ఏప్రిల్ 30వ తేదీ చరిత్రలో నిలిచిందన్నారు. నాటి సోవియట్ యూనియన్, చైనా, లావోస్, కంబోడియా నాయకత్వానికి ఈ ఘనత దక్కుతుందని చెప్పారు. గతాన్ని గౌరవమిస్తూ, వ్యత్యాసాలను సన్మానిస్తూ శాంతి పథంలో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. భావి తరానికి మెరుగైన ప్రపంచాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు టూ లామ్ వెల్లడించారు.

భద్రతా బలగాల చేతికి కర్రెగుట్ట

(మొదటిపేజీ తరువాయి)

ఆర్మీ బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఆ ప్రాంతాన్ని మావోయిస్టుల నుంచి విముక్తి చేస్తూ... తమ విజయానికి చిహ్నంగా కొండ పైభాగంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాయి. ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా గతవారంలో ఈ అతిపెద్ద ఆపరేషన్‌ను బలగాలు చేపట్టాయి. బుధవారంతో యాంటీ నక్సల్స్ ఆపరేషన్ తొమ్మిదో రోజుకు చేరింది. ఎయిర్ డ్రాప్ ద్వారా కమాండోలు కొండపైకి చేరుకుని ఆపరేషన్ చేపట్టారు. వివిధ యూనిట్లకు చెందిన సుమారు 24 వేల మంది భద్రతా సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీసు విభాగాలు, సీఆర్‌పీఎఫ్, ఎలైట్ కమాండో బెటాలియన్స్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) కమెండోలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 2 వేల సాయుధ నక్సలైట్లు భద్రతా బలగాల ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. కర్రెగుట్ట కొండ ఐదు వేల అడుగుల ఎత్తులో ఉండే పర్వత ప్రాంతం కావడంతో పాటు ప్రస్తుతం ఆ కొండపై ఉష్ణోగ్రత 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ ఉంది. నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. త్వరలో కర్రెగుట్టలపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కర్రెగుట్ట అటు చత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పరిధిలో... ఇటు తెలంగాణలోని ములుగు వాజేడు మండలం పరిధిలో విస్తరించి ఉన్నాయి. డ్రోన్‌లు, హెలికాప్టర్‌లతో భద్రతా బలగాలు కూంబింగ్ కొనసాగించారు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో కొంతమంది మావోయిస్టులు మరణించారు. రాయపూర్ నుంచి ఆపరేషన్‌ను పర్యవేక్షించిన ఐబీ చీఫ్ బుధవారం నేరుగా కర్రెగుట్టకు చేరుకున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా ఆపరేషన్‌లో పాల్గొన్న బృందం మొత్తాన్ని వెనక్కి రప్పించి... అక్కడ కొత్త బృందాన్ని మోహరింపజేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే త్వరలో సీఆర్‌పీఎఫ్ అక్కడ బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనుంది. తెలంగాణ, చత్తీస్‌గఢ్‌కు ఉపయోగపడేలా ఈ బేస్ ఉండనున్నట్లు సమాచారం.

అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీంలో తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది. గతంలో కూడా పురుషోత్తం రెడ్డి తన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం (ఈసీఐ) సెక్షన్ 26ను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ విషయంపై గతంలో కూడా సుప్రీంకోర్టులో చర్చలు జరిగినప్పటికీ, తాజా విచారణ అంశం చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేసింది. రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని పిటిషనర్ తరఫు న్యాయవాదులు ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు, తెలంగాణలో 119 సీట్లు ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. పునర్విభజన చట్టం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున, ఈ అంశంలో కేంద్రం ఆలస్యం చేయడం సమంజసం కాదని వెల్లడించారు.

పశ్య కన్నమ్మ కన్నుమూత

సీపీఐ ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర- హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట వీరనారి పశ్య కన్నమ్మ (97) బుధవారం ఉదయం హుజూర్‌నగర్‌లో మృతి చెందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కన్నమ్మ భౌతికకాయానికి గురువారం హుజూర్‌నగర్‌లో అంత్యక్రియలు జరుగుతాయి. కన్నమ్మ మృతి పట్ల సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు, శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి, స్వాతంత్ర్య సమయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి... కన్నమ్మ మృతికి ప్రగాఢ సంతాపం, కుటుంబసభ్యులు సానుభూతి తెలిపారు. కన్నమ్మ... సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మకి తల్లి. ఆమె భర్త దివంగత రాంరెడ్డి కూడా తెలంగాణ సాయుధ పోరాట యోధులు.

నియంతలకు, పెట్టుబడిదారులకు మోకరిల్లం

టర్కీ కమ్యూనిస్టు పార్టీ 'మేడే' పిలుపు

అంకారా: పెట్టుబడిదారులకు, నియంతలకు మోకరిల్లబోమని మేడే సందర్భంగా టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీసీపీ) ఒక ప్రకటన చేసింది. శ్రామిక వర్గం దోపిడీకి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. దోపిడీ, అసమానతలతో కమ్ముకున్న చీకటిని పారద్రోలడానికి మేడే సందర్భంగా టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఛత్రం కిందకు కార్మికులంతా వస్తారని పేర్కొంది. లౌకిక, స్వతంత్ర్య, సార్వభౌమ దేశాన్ని నమ్మే వారంతా ఏకం కావాలని పిలుపునిచ్చింది. టర్కీ గణతంత్ర వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరింది. సామ్రాజ్యవాదం, నాటో వ్యతిరేకులు... దేశానికి, మానవాళికి విముక్తి మార్గంగా సోషలిజాన్ని భావించే వారి ఐక్యతకు 'మేడే' సందర్భంగా పిలుపునిస్తున్నట్లు టర్కీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. మనలోని కోపానికి సరైన దిశ ఇవ్వడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చింది.

'మనం కష్టాల్లో ఉన్నాం. క్లిష్ట పరిస్థితులు అనుభవిస్తున్నాం. అందుకే మనం జీవిస్తున్న పరిస్థితులు, పరిపాలన యంత్రాంగం, పాలకులపై కోపంగా ఉన్నాం. యుద్ధం వంటి అసాధరణ పరిస్థితుల్లో చవిచూపే పేదరికరాన్ని అనుభవిస్తున్నాం. రోజురోజుకూ దోపిడీ పెరిగిపోతోంది. మనం పిల్లలమా పెద్దలమా మహిళలమా పురుషులమా అని చూడకుండా మన శ్రమను, జీవితాలను పెట్టుబడిదారులు దోచుకుంటున్నారు. బానిసత్వ పరిస్థితులను ఆపాదిస్తున్నారు. సురక్షిత భవిష్యత్ కోసం మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవడం కోసం ప్రశాంతంగా జీవించాలనుకునే శ్రామికవర్గాన్ని దోచుకుంటున్నారు' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. గుప్పెడు పెట్టుబడిదారులు సుసంపన్నులు అయ్యేందుకే ... రేపటి కోసం పౌరుల కలలు- ఆశల హరణ జరుగుతోందని కమ్యూనిస్టు పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. 'నిసిగ్గు, అత్యాసల పెట్టుబడిదారీవర్గం దేశాన్ని దోచుకుంటోంది. ప్రకృతిని కొల్లగొడుతోంది. శ్రామికులను పేదరికంలోకి నెడుతూ బానిసత్వ సంకెళ్లు వేయాలని చూస్తోంది. గొంతెత్తలేని శ్రామిక వర్గంతో కూడుకున్న టర్కీని పెట్టుబడిదారులు / నియంతులు కోరుకుంటున్నారు. అంతర్జాతీయ గుత్తాధిపత్యం కోసం ప్రాకులాడుతున్నారు. పేదల చేమటోడ్చి సృష్టించే సంపదను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. దోపిడీ-అసమానతతో కూడున్న వ్యవస్థను నిర్మిస్తున్నారు. తమను ప్రశ్నించే వారు లేకుండా చూయాలని అనుకుంటున్నారు. ఇటువంటి పెట్టుబడిదారీ వర్గానికి, నియంతలకు మనం తలొగ్గబోం... వారి ఎదుట మోకరిల్లబోం' అంటూ మేడే ప్రకటనలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. మన ఆగ్రహాన్ని సంస్థాగత శక్తిగా మల్చుకొని పెట్టుబడిదారీ వ్యవస్థను కూలగొడదామని పిలుపునిచ్చింది.

ప్రజా పోరాటాలు-సోషలిజం వర్ధిల్లాలి

యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ 'మేడే' నినాదం

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం (మేడే)ను పురస్కరించుకొని 'ప్రజా పోరాటాలు, ఉద్యమాలు వర్ధిల్లాలి, సోషలిజం వర్ధిల్లాలి' అని యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ నినాదమిచ్చింది. యూరప్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వర్కర్లకు, యువతకు, మహిళలకు, పింఛన్‌దారులకు ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నట్లు పేర్కొంది. చికాగో తిరుగుబాటు, శ్రామిక వర్గ వీరోచిత పోరాటాలను స్మరించుకుంది. నాటి పోరాటాలే నేటి ఉద్యమాలకు స్ఫూర్తి అని వెల్లడించింది. పోటీ మితిమీరితే యుద్ధానికి దారితీస్తుందని... ఇతర విధానాలన్నీ విఫలమైనప్పుడు కేపిటలిస్ట్ పోటీలో లాభాలు, ప్రత్యర్థులపై దాడికిగాను బల ప్రయోగం జరుగుతుందని తెలిపింది. ఈ పరిస్థితులు నూతన పెట్టుబడిదారీ వర్గ సంక్షేమానికి దారితీస్తాయని హెచ్చరించింది. అలాగే కేపిటలిస్ట్ యుద్ధం ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది. ఇటువంటి పరిణామాలతో ప్రపంచ శ్రామిక వర్గానికి పెద్ద ప్రమాదం పొంచివున్నదని యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే పెట్టుబడిదారీ విధానానికి స్వస్తి పలకాలని నొక్కి చెప్పింది. శ్రామిక వర్గ ఐక్యతకు, సోషలిస్టు ప్రపంచం నిర్మాణానికి యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ పిలుపునిచ్చింది.

పీవోకే ఆక్రమణే కశ్మీర్‌కు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని వ్యాఖ్యానించారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నా నని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు. కాగా, పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉగ్రవాద నిర్మూలనలో న్యూఢిల్లీకి తాము ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపింది. పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల లండన్‌లో భారతీయులు నిరసన చేపడుతున్న సమయంలో అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్నట్లు ఉన్న వీడియో తమను ఆందోళనకు గురి చేసిందని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. రెండు దేశాలతో తమకు సత్సంబంధాలు ఉన్నందున వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవట్లేదని పేర్కొంది. కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని... వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

రాహుల్ హర్షం

(మొదటిపేజీ తరువాయి)

ముందడుగుగా అభివర్ణించారు. కేంద్రం ఏ కారణంగానైనా కులగణనకు ఒప్పుకున్నందుకు సంతోషమేనన్నారు. కులగణనకు తాము సహకరిస్తామన్నారు. అయితే కులగణన నిర్ణీత సమయం తెలపాలని కేంద్రాన్ని డిమాండ్‌చేశారు. కులగణన అనేది తొలి మెట్టుమాత్రమేనని ఇందులో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన బ్లూప్రింట్‌గా, దేశానికే ఓ నమూనాగా నిలుస్తుందన్నారు. కులగణనలో తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు రాహుల్ గాంధీ. బీహార్ లో కులగణనకు తెలంగాణలో కులగణనకు తేడా ఉందని...తెలంగాణలో కులగణన పారదర్శకంగా జరిగిందని చెప్పారు. కులగణనకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కులగణన ఎప్పటిలోగా చేస్తారో చెప్పాలని, ఇందు కోసం బడ్జెట్ లో నిధులు కేటాయించాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్ అవసరమని చెప్పారు. దేశ అభివృద్ధి కులగణనతోనే సాధ్యమని తెలిపారు. కులగణన దేశ అభివృద్ధికి తొలి అడుగు అని అన్నారు. కులగణనతోనే ప్రతీ వర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. కులగణన ద్వారా ప్రజలకు అధికార భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. ఇన్నాళ్లు మోదీ సర్కార్ కులగణనపై నిర్లక్ష్యం వహించిందని రాహుల్ విమర్శించారు. కులగణనతో దేశ ఆర్థికి పరిస్థితి మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన అమలు చేస్తామని తాము పార్లమెంటులోనే చెప్పామన్నారు. ఇందు కోసం కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలకు అభినందనలు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ఖండిస్తుందోన్న రాహుల్... కేంద్రం ఏ చర్య తీసుకున్నా మద్దతిస్తామని చెప్పామన్నారు. ప్రధాని మోదీ ఎలాంటి చర్య తీసుకుంటారో చూద్దామన్నారు.

కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా: సీఎం రేవంత్ రెడ్డి

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దార్శనికత నెరవేరబోతోందని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలిగారని పేర్కొన్నారు.

దేశంలో కుల గణన ప్రక్రియను ప్రారంభించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కుల గణన ఆవశ్యకతపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేసిందని, తెలంగాణ కాంగ్రెస్ నేతలు సైతం దిల్లీ వేదికగా ఆందోళనలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. "తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది" అనే విషయం మరోసారి స్పష్టమైందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రజల మేలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చేయడం సంతోషంగా ఉందన్నారు. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను మనం తెచ్చుకున్నామన్నారు. ప్రతిమనిషి గౌరవంగా బతికేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాలకపక్షం తీసుకునే నిర్ణయాలలో లోపాలను ఎత్తి చూపేందుకే ప్రతిపక్షం అనే వ్యవస్థ ఉందన్నారు. వరంగల్ సభలో మేం చేసిన మంచిని అభినందించి ప్రజా సమస్యలను ప్రస్తావించి ఉంటే ప్రజలు కేసీఆర్‌ను అభినందించే వాళ్లన్నారు. ఇన్నాళ్లు ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారు,

ఇది ఏ చట్టంలో ఉందో చెప్పాలని నిలదీశారు. ఇప్పటి వరకు ప్రతిపక్ష నాయకుడిగా రూ.65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారని, మరి ఎందుకు ప్రతిపక్ష నాయకుడిగా పని చేయకుండా ఫామ్ హౌస్‌లో పడుకున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. సభలో సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన మాట్లాడిండు, కాని రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయిందో చెప్పాలన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని ఇవేవీ మీకు కనిపించడంలేదా అంటూ నిలదీశారు. కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు విజ్ఞులని ఎవరేం చేశారో వారికి తెలుసన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి, కాళేశ్వరం, ఉచిత బస్సు, రుణమాఫీ, రైతు బంధు, మేం ఇచ్చిన 60 వేల ఉద్యోగాలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన వీటిలో దేనిపై చర్చ చేద్దాం దానికి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారా అనే విషయం చెప్పాలన్నారు.

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అంటున్న కేసీఆర్ ముందు పదేళ్లు దోచుకున్న నీకు కాంగ్రెస్ ను విమర్శించే హక్కు లేదన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ఆదాయం పెంచాలని, పేదలకు పంచాలి అనే విధానంతో తమ ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందని చెప్పారు.భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం పనిచేయడమే కాదు సమాజంలో పుట్టిన ప్రతి ఒక్కరు పనిచేయాలని చెప్పారు. సమాజంలో ఎవరిని కించపరచొద్దు, అణగదొక్కొద్దు అని చాటి చెప్పిన సమాజ పరివర్తకుడు బసవేశ్వరుడని కొనియాడారు.

కులగణనకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

చేర్చలేదు. కుల గణన అంశాన్ని కేబినెట్‌లో పరిశీలిస్తామని 2010లో అప్పటి ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు. చాలా రాజకీయ పార్టీలు కుల గణనను సిఫార్సు చేశాయి. కుల గణనకు బదులు సర్వే మాత్రమే చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సర్వేనే ఎస్ఈసీసీ అంటారు. కాంగ్రెస్, దాని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కుల గణనను రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించుకున్నాయని బాగా అర్థమైందని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం, సబ్జెక్ట్ సెన్సస్ ఏడవ షెడ్యూల్‌లోని యూనియన్ జాబితాలో 69గా జాబితా చేయబడింది. భారత రాజ్యాంగం ప్రకారం, జనాభా గణన అనేది యూనియన్ సబ్జెక్ట్ అని మంత్రి అన్నారు. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించేందుకు సర్వేలు నిర్వహించగా... అందులో కొన్ని రాష్ట్రాలు దీన్ని బాగా చేయగా... కొన్ని మాత్రం రాజకీయ కోణం నుండి ఇటువంటి సర్వేలను నిర్వహించాయన్నారు. ఇలాంటి సర్వేలు సమాజంలో అనుమానాలకు తావిస్తున్నాయని చెప్పారు. ఈ వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాజకీయాల వల్ల సామాజిక వ్యవస్థకు భంగం కలగకుండా చూసేందుకు, కుల గణనను సర్వేలకు బదులు పారదర్శకంగా జనాభా గణనలో చేర్చాల్సి ఉందన్నారు. ఇది దేశ పురోగమనంలో సమాజ సామాజిక, ఆర్థిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. అందుకోసమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ రాబోయే జనాభా గణనలో కుల గణనను చేర్చాలని నిర్ణయించిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

పహల్గాంపై మౌనం

కేంద్ర కేబినెట్ భేటీలో పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంతా భావించినప్పటికీ అటువంటిదేమీ జరగలేదు. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎటువంటి ప్రకటన చేయలేదు. దాంతో దాడికి సంబంధించి ప్రతిచర్యలపై కేంద్రం మౌనం పాటిస్తూ ముందుకెళ్లడం కూడా వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు..

సిసోదియా, జైన్‌పై ఏసీబీ కేసు

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ మధుర్ వర్మ తెలిపారు. ఆప్ ప్రభుత్వంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. సత్యేంద్ర జైన్ ప్రజా పనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో దిల్లీలో 12 వేల తరగతి గదులు, పాఠశాల భవనాలను నిర్మించారు. వాటిని అధిక వ్యయంతో నిర్మించారని, రూ.2 వేల కోట్లు అక్రమాలు జరిగాయని ఏసీబీ గుర్తించింది. ఈ పనులను 34 మంది కాంట్రాక్టర్లకు అప్పగించారని... అందులో ఎక్కువ మంది ఆప్‌తో సంబంధాలు కలిగిన కాంట్రాక్టర్లే ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోపు నిర్మాణం పూర్తి కాలేదని... దీని కారణంగా ఖర్చు భారీగా పెరిగిందని ఏసీబీ తెలిపింది.

బాలికలదే హవా

(మొదటిపేజీ తరువాయి)

నిలిచారు. రవీంద్ర భారతి ఆడిటోరియంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, వేంనరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎంపీ సురేష్‌షట్కర్, మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావులతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 4,629 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించగా రెండు పాఠశాలల్లో సున్న శాతం ఉత్తీర్ణత నమోదైంది. మహబూబాబాద్ జిల్లా 99.29 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలవగా 73.97 శాతంతో వికారాబాద్ జిల్లా చివరిస్థానంలో నిలిచింది. 5,07,564 మంది విద్యార్థులకుగాను 5,07,107మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 4,96,374 మంది రెగ్యులర్ , 10,733 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు విద్యార్థులు 57.22శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 55.14 శాతం, బాలికలు 61.70 శాతం ఉత్తీర్ణులయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 2,50,345 మంది బాలురు పరీక్షలు రాయగా 2,28,608 మంది ఉత్తీర్ణత సాధించారు. 2,46,029 మంది బాలికలు 2,31,911మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాల వారీగా చూస్తే.. 99.29 శాతం ఉత్తీర్ణతతో మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా... 99.09శాతంతో సంగారెడ్డి, 98.81శాతంతో జనగామ, 98.20 శాతంతో జగిత్యాల, 98.15 శాతంతో రాజన్న సిరిసిల్ల మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. అలాగే 89.21శాతంతో వనపర్తి, 88.53 శాతంతో హైదరాబాద్, 87.84శాతంతో రంగారెడ్డి, 87.25శాతంతో కోమరంభీం అసిఫాబాద్, 73.97శాతంతో వికారాబాద్ చివరి ఐదు స్థానాల్లో నిలిచాయి. నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉండే హైదరాబాద్ రంగారెడ్డి అట్టడుగు నుంచి మూడు... నాలుగు స్థానాల్లో ఉన్నాయి. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

ధాన్యం కొనుగోలుకు రూ.15 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. రానున్న 20 రోజులు అత్యంత కీలకమైనవని, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్బందులు కలెక్టర్ల దృష్టికి వస్తే సత్వరమే చర్యలు తీసుకుంటారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర రైతుల ఖాతాలో జమచేయడంతో పాటు సన్నాలకు బోనస్ చెల్లింపులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,381 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 13.71 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని మరో 3.79 కోట్ల గోనె సంచులు సమీకరిస్తున్నట్లు వివరించారు. ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గోదాములు అందుబాటులో లేని చోట్ల నేరుగా రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అవసరం అని భావించిన ప్రాంతాల్లో ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ ఉంచే సామర్థ్యం కలిగిన గోదాములను కేటాయించినట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే 29 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందని, సుమారు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. రూ. 4,545.72 కోట్లకు గాను రూ. 2,289 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు.సన్నాలకు బోనస్ నిమిత్తం రూ. 444.20 కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. తేమ శాతాన్ని తెలియజెప్పే డయ్యర్‌లను కొనుగోలు చేసిన కరీంనగర్ కలెక్టర్ ను ఆయన అభినందించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని సూచించారు. సీఎంఆర్ నిమిత్తం 1,579 రైస్ మిల్లులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లులకు కేటాయించినట్లు మంత్రి స్పష్టం చేశారు. తెల్ల రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వేర్వేరు ప్రాంతాల నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

హైకోర్టులో ఐపీఎస్‌లకు చుక్కెదురు

విశాలాంధ్ర-హైదరాబాద్: భూదాన్ భూముల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలకు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారని, ఈ అక్రమాలపై విచారణ జరపాలని బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి.భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఏప్రిల్ 24న కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు భూములను ఏప్రిల్ 27 నుంచి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 194లో ఉన్నది పట్టా భూమి అని, భూదాన్ భూమి కాదని కోర్టుకు తెలిపారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే సింగిల్ బెంచ్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చిందని వారు వాదించారు. పిటిషనర్ కోరిన దానికంటే ఎక్కువ ఉపశమనాన్ని సింగిల్ బెంచ్ కల్పించిందని, పిటిషన్‌ను ఉపసంహరించుకోవద్దని రిజిస్ట్రీని ఆదేశించే అధికారం కూడా సింగిల్ బెంచ్‌కు లేదని వారు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ఐపీఎస్ అధికారుల తరపు న్యాయవాదులకు సూచించింది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోళ్లను కేంద్రాలలో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, నల్గొండ మండలం, నకిరేకల్ మండలాలలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ నల్గొండ మండలం, చందనపల్లి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ కేంద్రంలో అన్ని సౌకర్యాలు బాగానే ఉన్నప్పటికీ, మరో రెండు వాహనాలను పెంచి త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని ఆదేశించారు. ముఖ్యంగా అకాల వర్షాలు వస్తున్న దృష్ట్యా కొనుగోలులో ఇబ్బందులు ఏర్పడి రైతులు నష్టపోకుండా కొనుగోలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు. రైతులు ఎట్టి పరిస్థితులలో నాణ్యత ప్రమాణాలతో కూడుకున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని చెప్పారు. ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తహసిల్దార్ హరిబాబు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

బసవేశ్వర చరిత్ర భావితరాలకు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : హైందవ మతాన్ని సంస్కరించిన బసవేశ్వరుడి చరిత్ర భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి హాజరై బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని కర్ణాటక రాష్ట్రంలో బాగేవాడి గ్రామంలో జన్మించిన బసవేశ్వరుడు 12 వ శతాబ్దంలో హైందవ మతాన్ని సంస్కరించిన వారిలో ప్రముఖుడని. సమాజంలో కుల వ్యవస్థ, వర్ణ విభేదాలు, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని, లింగాయత ధర్మం స్థాపించి వచన సాహిత్యంతో కుల మతాలకు అతీతంగా సమాజాన్ని ఏకం చేశారని అన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఇందిరమ్మ ఇండ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపిక చేసిన వారికీ మాత్రమే ఇండ్లు వస్తున్నాయి. ఇలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు అన్నారు. బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో 3500 ఇల్లు మంజూరు చేస్తామన్నారని, పైలెట్ ప్రాజెక్టు గ్రామానికి ఎక్కువ మొత్తంలో ఇండ్లు మంజూరు చేస్తే మిగతా గ్రామాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం లేదని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరు చేశారో తెలియ జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చెన్నబోయిన సైదులు, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరు సైదులు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నెరవేరుతున్న ప్రజల చిరకాల కోరిక : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తొర్రూర్ : తొర్రూరు పట్టణానికి ఇది ఒక చారిత్రక రోజని, మా ప్రజల దీర్ఘకాల వాంఛను నెరవేర్చడం ఎంతో సంతోషం, ఆనందంగా ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్, చెరువు కట్ట నిర్మాణ పనులను ముత్యాలమ్మ తల్లికి పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ మహిళా నాయకురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు పట్టణానికి ఇది ఒక చారిత్రక రోజని, మా ప్రజల దీర్ఘకాల వాంఛను నెరవేర్చడం నా వ్యక్తిగత గర్వంగా భావిస్తున్నానని అన్నారు. ఈ చెరువు కట్ట నిర్మాణం పూర్తి అయితే పట్టణానికి వరదల సమస్య తొలగి పోవడమే కాక, భూగర్భ జలాల స్థాయి పెరగడం, పర్యావరణం రక్షించబడ డం, అలాగే అందమైన సుందర ప్రాంతంగా మారడం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, మున్సిపల్ అధికారులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, పట్టణ ప్రజలు ఉన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి: సయ్యద్ గౌస్ పాషా

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అణచివేయాలని ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పాషా అన్నారు. ఎన్ హెచ్ ఆర్ సి ఆధ్వర్యంలో సోమవారం కొండమల్లేపల్లి లో జమ్మూ కాశ్మీర్‌లోని మహల్గంలో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా, ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మ శాంతికి నివాళులర్పిస్తూ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సకల మతాలు అన్న దమ్ముల వలె అన్యోన్యంగా బ్రతుకు తున్న సమయంలో పాకిస్తాన్ ఉగ్రమూ ఖలు అలజడిని సృష్టించడం బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని సూచించారు. ఉగ్రదాడిలో చనిపోయిన భారతీయులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పించి వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భారీ ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, ఎన్.హెచ్.ఆర్.సి జిల్లా జనరల్ సెక్రెటరీ బండి నరేష్, జున్నుదయ, పెద్దిశెట్టి సత్యనారాయణ, ముస్ని అంజన్, గార్లపాటి శ్రీను, కుంభం గిరి గౌడ్, ఎండి అల్తాఫ్, ఎండి ఆరిఫ్, బీజేవైఎం నాయకుడు నెల్లికంటి గోపి, ఓర్సు వెంకటేష్ పాల్గొన్నారు.

రూ.1070 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

విశాలాంధ్ర - ఖమ్మం, కూసుమంచి : రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్య సహాయం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో 1070 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 23 లక్షల 33 వేల రూపాయలు, 35 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. ఆనాడు పాలించిన పాలకులు 10 సంవత్సరాలలో వైద్యం పట్ల ఎప్పుడూ మనం ఇచ్చిన నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున రిలీఫ్ ఫండ్ ఇవ్వడం ఇదే మొదటిసారి అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా, సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 71 మంది లబ్ధిదారులకు 23 లక్షల 33 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను, కళ్యాణలక్ష్మి పథకం క్రింద 35 మంది లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, కూసుమంచి మండల ఇంచార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష నిర్వహణకు కంట్రోల్ రూమ్ : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : మే నెల 4వ తేదీన జిల్లాలో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణ కొరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో 287 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. నీట్-2025 పరీక్ష సంబంధిత వివరాలు, సహాయం, సందేహాల నివృత్తి కొరకు కంట్రోల్ రూమ్ నం.6304686505 ఏర్పాటు చేయడం జరిగిందని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఆపరేషన్ కాగర్ ను వెంటనే నిలిపివేయాలని, కేంద్ర బలగాలు వెనక్కి రావాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, దళిత ప్రజా సంఘాలు, కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆదివాసీలను రక్షించాలని కోరుతూ, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని శాంతి ర్యాలీ ములుగు డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర నుండి ర్యాలీగా బయలు దేరి బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్‌కి పూల మాల వేశారు. అనంతరం ర్యాలీగా, కలెక్టరు కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించి తెలంగాణ ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. అనంతరం ర్యాలీగా మినిస్టర్ క్యాంప్ కార్యాలయంనకు వెళ్ళి మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించి, చతిస్గడ్ ఆదివాసి ప్రాంతంలో నక్సలైట్ నిర్మూలన కోసం గాలింపు చర్యలు నిమిత్తం ఆపరేషన్ కగార్ పేరుతో సైనిక చర్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేస్తున్నదని, ఈ కారణంగా ఆదివాసీలు అనేక కష్టాలను అనుభవిస్తున్నారు. తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమనాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జై సింగ్ రాథోడ్, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్, శాంతి చర్చల కమిటీ సభ్యులు సోమ రామ్మూర్తి, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతి, ట్రైబల్ డెమోక్రాటిక్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ సింగ్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంపిడి వెంకటేశ్వర్లు, ఎల్ యచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య రాథోడ్, ఏం ఆర్ పి ఎస్ జాతీయ నాయకులు నెమలి నర్సయ్య, భారత రాజ్యాంగ పరిరక్షణ నాయకులు జన్ను రవి, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ అరెం లచ్చు పటేల్, ఏ యస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాదులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆయన వారి ధాన్యం కొనుగోళ్లపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ సంవత్సరం యాసంగి పంట 54 లక్షల 89 వేల ఎకరాల్లో సాగు కాగా, దాదాపు కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని వివరించారు. కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తేమ, తూకం, శుద్ధీకరణ యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, గన్ని బస్తాలు లాంటి వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. గోదాముల పర్యవేక్షణ కూడా నిరంతరంగా కొనసాగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఏ డి మార్కెటింగ్ గజానంద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన నరేష్

విశాలాంధ్ర - గూడూరు: గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాబోయే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ వస్తుందని, గూడూరు మండలం దామరవంచ గ్రామస్తుడు గుండ్రపల్లి నరేష్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి పార్టీ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలైనా ప్రజలకు చేసింది ఏమీ లేదని, బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు పాలించి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు, అనేక పథకాలు ప్రవేశపెట్టిందని నరేష్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూనావత్ స్వాతి, రవి నాయక్ తెలుపుతూ రవి రావడం సంతోషకరమని తెలిపారు.

ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత : మంత్రి ఉత్తమ్

శాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: రబీ ధాన్యం సేకరణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న, ప్రతిష్టాత్మక పథకాలలో ఒకటని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.రబీ ధాన్యం సేకరణపై బుధవారం హైదరాబాద్ నుండి మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం నుండి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. రానున్న 15, 20 రోజులు జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల, సంబంధిత శాఖల అధికారులందరూ ధాన్యం సేకరణకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది మిల్లర్లు వివిధ కారణాలతో హెచ్ ఎన్ పి, ఆర్ఎన్ఆర్, 1638 రకాల ధాన్యాన్ని నూకలు ఎక్కువగా అవుతున్నా యన్న సాకుతో సకాలంలో మిల్లుల వద్ద ధాన్యాన్ని దించుకోవడంలేదని, అలాగే క్వింటాలకు ఐదారు కేజీల తరుగు తీస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నదని, మిల్లర్లు ఎట్టి పరిస్థితులలో తరుగు తీయవద్దని ఆయన ఆదేశించారు. డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సిపిఓ సుబ్బారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, డిహెచ్ఓ మరియన్న, డిపిఓ విజయనిర్మల, మార్కెటింగ్ శాఖ ఏడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరోలో : యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావుతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, 137.10 ఎల్.ఎం.టి. ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70.13 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. డిఎం సివిల్ సప్లయిస్ రాంపతి, డిసిఓ సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సిసిఎల్ఏ కమీషనర్, భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులపై పైలెట్ మండలాలు ఉన్న 4 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., ములుగు జిల్లా రెవిన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆర్డీఓ వెంకటేష్‌లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా ముందస్తుగా 4 పైలెట్ మండలాలను ఎంపిక చేసుకొని, రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామని అన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ భాస్కర్, గిరిబాబు పాల్గొన్నారు.

పలువురు పోలీసు అధికారుల పదవీ విరమణ

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబా బాద్: ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ తప్పదని, ఉద్యో గ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ ఆకాంక్షించారు. బుధవారం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఏ ఎస్ ఐ భూక్యా కిషన్, ఏ ఎస్ ఐ సోమా కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ స్వర్ణపాక పాపయ్య, ఏ ఎస్ ఐ మహమ్మద్ అహ్మద్, ఏ ఎస్ ఐ పెద్దిరెడ్డి రమేష్ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పదవీ విరమణ పొందిన అధికారులు తమ జీవితంలో ముఖ్యమైన భాగాన్ని పోలీసు శాఖకు అంకితం చేశారని, వారి కృషి, నిబద్ధత, సేవాభావం శాశ్వతంగా గుర్తించబడతాయని, నూతన అధికారులకు ప్రేరణగా నిలిచారని అన్నారు.సన్మానితులుగా పాల్గొన్న పదవీ విరమణ పొందిన అధికారులు తమ అనుభవాలను పంచుకుంటూ, పోలీస్ జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, గంధ్రతి మోహన్, విజయ్ ప్రతాప్, సీఐలు నరేందర్, సరవయ్య, సత్యనారాయణ, ఆర్.ఐలు నాగేశ్వరరావు, అనిల్ ఇతర సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని సంతోషంగా గడపాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ప్రతిరోజు విధుల నిర్వహణలో బిజీగా ఉంటూ కాలం గడిపే ఉద్యోగులకు ఏదోఒక రోజు పదవి విరమణ అనివార్య మని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన ఏఎస్సై సోమేశ్వర రావు ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏఎస్సైగా సోమేశ్వరరావు పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు. గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ, పోలీస్ శాఖలో వివిధ విభాగాలలో నిజాయితీగా, బాధ్యతగా విధులను నిర్వర్తించిన సోమేశ్వరరావు సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షులు ఏసోబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అందాల పోటీలంటే స్త్రీల ఆత్మ గౌరవాన్ని కించపరచడమే

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన అందాల పోటీలను రద్దు చేయాలని సామజిక వేత్త, జమాతే ఇస్లామి హింద్ రామవరం - రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ కోరారు. అమ్మ, ఆలి, తనయగా ఎంతో గౌరవంగా చూడాల్సిన మనం స్త్రీలను అంగడి బొమ్మలు, వ్యాపార వస్తువుగా చేయడం శోచనీయం అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించే ఆలోచనే హేయమైన చర్య అని విమర్శించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా మన భారతీయ పుణ్యభూమిలో స్త్రీలను అత్యుత్తమ రీతిలో ఆదరించే సంస్కృతి ఉందన్నారు. అలాంటి పుణ్యమూర్తులను, సాంప్రదాయాన్ని స్వయంగా ప్రభుత్వమే అపహస్యం పాలు చేస్తూ అందాల పోటీలు నిర్వహించడమనేది మన సామాజిక తరాలకు తప్పుడు సంకేతం అందించినట్లే నని ఆవేదన వ్యక్తం చేసారు. వేంటనే ఈ అందాల పోటీలను ఆపాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డిని కోరారు. స్త్రీలను అందంతో కాదు... వారిని ఆత్మ గౌరవంతో మన సమాజం చూడాలని బాసిత్ ఆకాంక్షించారు.

ఏఐటియుసి పోరాటాల ఫలితమే అంగన్వాడీలకు వేసవి సెలవులు

ఫైల్ ఫోటో

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : అంగన్వాడీలకు వేసవి సెలవుల కోసం గతం నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించామని దాని ఫలితంగా ప్రభుత్వం మే నెల మొత్తం వేసవి సెలవులు ప్రకటించడం అభినందనీయమని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ అన్నారు. ఇదే నేపథ్యంలో మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. గురువారం నుంచి అంగన్వాడీలు టి హెచ్ ఆర్ ఇచ్చి మే నెల మొత్తం సెలవులు తీసుకోవచ్చని ప్రసాద్ తెలిపారు. బుధవారం ఐసీడీఎస్ కమిషనర్‌తో హైదరాబాద్‌లో జరిగిన చర్చల్లో వారు సెలవులు ప్రకటించడం జరిగినదన్నారు. వేసవి ఎండల వల్ల అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు, గర్భవతులు రాలేని పరిస్థితిపై అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు నేడు ఫలితమిచ్చాయన్నారు. రాష్ట కాంగ్రెస్ ప్రభుత్వం, ఐసీడీఎస్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఐసీడీఎస్ చరిత్రలో వేసవి శెలవులు టేక్ హోమ్ రేషన్ పద్దతిలో లబ్దదారులకు ఫీడింగ్ అందించి సెంటర్స్‌కు రాకుండా సెలవలు ప్రకటించటం జరిగిందన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా ప్రమోట్ చేస్తూ టీచర్‌గా పని చేస్తున్న వారికి వేతనం రూ.6750 నుండి రూ.13650 లకు పెంచుతూ మే నెల నుండి వేతనం అందించనున్నట్లు ఐసిడిఎస్ శాఖ కమిషనర్ క్రాంతి వెస్లీ కార్మిక సంఘాల జాయింట్ మీటింగ్‌లో తెలియచేశారని ప్రసాద్ తెలిపారు. రాజ్యాంగబద్ధ పోరాటాలే హక్కులను సాధించి పెడతాయని ఈ సందర్భంగా ప్రసాద్ అన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఫలితాలు

విశాలాంధ్ర - కారేపల్లి : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ మోడల్ పాఠశాల, జడ్పీఎచ్ఎస్ విశ్వనాథపల్లి, కోమట్లగూడెం,పేరేపల్లి, ఉసిరికాయలపల్లి, రేలకాయలపల్లి ఆశ్రమ గిరిజన బాలుర పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. మాదారం జేడిపీపీ పాఠశాలకు చెందిన చాగంటి సాయిమాన్విమ 574 మార్కులతో మండల ప్రథమస్థానం సాధించగా ద్వితీయ స్థానం ఆర్ దత్తాత్రేయ 563, తృతీయ స్థానం మోడల్ పాఠశాల విద్యార్థి పోలోజు యశ్వంత్ 559, టిటిడబ్ల్యాయు ఆర్‌జెసి పాఠశాల విద్యార్థి బోడ చరణ్ 559 మార్కులు సాధించి మండలంలో టాపర్స్‌గా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి జయరాజ్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పెద్దపల్లి జక్షన్ పరిధిలో 37 గేటు మూసివేతను తొలగించాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి జంక్షన్ పరిధిలోని కొత్తపల్లి రైల్వే 37 నెంబర్ గేట్ మూసివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోజున గ్రామస్తులు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు, యువకులు మాట్లాడుతూ 37 గేటు మూసివేయడం వలన విద్యార్థులు రైతులు, తెనుగు పల్లె, అంబేద్కర్‌నగర్ వాసలు 3 కిలో మీటర్లు తిరిగి పాఠశాలకి, వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తుందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రైల్వే అధికారులు పునరాలోచన చేసి గేట్ తిరిగి నడిపించాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కలవేన రాజ్యయ్య, కలవేన శ్రీనివాస్, సబ్బు సతీష్, పల్లె సదానందం, ఎండి సుకుర్ కల వేన అశోక్, పల్లె సుందర్, పల్లె సాయి కలవేనా సతీష్, మద్దూల రాజేందర్, ప్రతాప్, శ్రీనివాస్ అరుణ్, శంకర్‌లు పాల్గొని మాట్లాడారు.

సంపాదకీయం

కులగణనపై బీజేపీ పిల్లిమొగ్గ

మోదీ ధ్యాస ఎప్పుడూ ఎన్నికల మీదే. మరో ఆరేడు నెలల్లో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి కనక కులగణన జరిపిస్తామని కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయించింది. ఇంతకాలం కులగణనను వ్యతిరేకిస్తూ వచ్చిన బీజేపీ బీహార్ ఎన్నికలలో లబ్ధి కోసం కులగణనకు అంగీకరించక తప్పలేదు. ఎన్నికలలో విజయం సాధించడానికి మోదీ ఏమైనా చేస్తారని మరోసారి రుజువు అయింది. జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా జరిపిస్తారట. అయితే జనాభా లెక్కల సేకరణ ఎప్పటి నుంచి ప్రారంభం అవుతుందో మాత్రం చెప్పలేదు. ఆఖరిసారి 2011లో జనాభా లెక్కలు సేకరించారు. 2021లో కరోనా కారణంగా జనాభా లెక్కలు సేకరించలేదు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో జనాభా లెక్కలు, అందులో భాగంగా కులాల తఖ్సీళ్లు కూడా సేకరించాలని నిర్ణయించారట. సమాజం, దేశ ప్రయోజనాలకు, విలువలకు బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందట. కులగణనను వ్యతిరేకించినప్పుడు విలువలు, ప్రయోజనాలు అటకెక్కాయి కాబోలు. సమాజంలో ఏ వర్గానికీ నష్టం కలగకుండా గతంలోనూ బీజేపీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేయడం బీజేపీ మరిచిపోలేదు. రిజర్వేషన్లు, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల వారికి వర్తించే రిజర్వేషన్లు అమలు చేయడానికి కులగణన అవసరమన్న వాదన ఎప్పటి నుంచో ఉంది. 2023 నవంబర్‌లో బీహార్‌లో కులగణన నిర్వహించారు. అప్పుడు నితీశ్ కుమార్ లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్‌జేడీతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తూ ఉండేవారు. ఆ తరవాత ఆయన షరా మామూలుగా ఆర్‌జేడీ చేయి వదిలేసి బీజేపీని ఆలింగనం చేసుకుని ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఆ తరవాత ఆయన ఎన్నడూ కులగణన గురించి ప్రస్తావించనైనా లేదు. ఆయన కులగణన జరిపిన సమయంలో 2024 సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉందన్న విషయాన్ని గమనించాలి. కర్నాటకలో పదేళ్ల కింద నిర్వహించిన కులగణను కాంగ్రెస్ నాయకుడు సిద్ధ రామయ్య ముఖ్యమంత్రి అయిన తరవాత ఆ లెక్కలకు ఆమోద ముద్ర వేశారు. ఆ తరవాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరవాత కులగణన నిర్వహించారు. రాజ్యాంగంలోని 246వ అధికరణం ప్రకారం జనాభా లెక్కల బాధ్యత కేంద్రానిదే. అంటే ఈ అంశం కేంద్ర జాబితాలో ఉంది. ఈ విషయం ఏడవ షెడ్యూలులో కూడా చేర్చారు. కొన్ని రాష్ట్రాలు కులగణన నిర్వహించిన వాస్తవాన్ని నేరుగా అంగీకరించకుండా ఆ రాష్ట్రాలు కులగణన కోసం సర్వే నిర్వహించాయని మంత్రివర్గ సమావేశ వివరాలు వివరించిన కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సన్నాయి నొక్కులు నొక్కే ప్రయత్నం చేశారు. కులగణన విషయంలో బీజేపీ వైఖరి ఎందుకు మారిందో మాత్రం ఆయన చెప్పలేదు. కొన్ని రాష్ట్రాలు రాజకీయ దృక్కోణంతో కులగణన నిర్వహించాయన్న నింద కూడా ఆయన మోపారు. ఆ లెక్కలు దాపరికం లేకుండా సేకరించలేదట. దాపరికం లేకుండా సమాజంలో చీలికలు రాకుండా కులగణన నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ పద్ధతిలో కులాలకు సంబంధించిన లెక్కలు సేకరిస్తే సామాజిక, ఆర్థిక చట్రాలు బలపడతాయట.

ప్రతిపక్ష పార్టీలు చాలా కాలంగా కులగణన నిర్వహించాలని కోరుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రతిపక్షాలు దీనినే ప్రధానాంశం చేశాయి. "ఇండియా" ఐక్య సంఘటన కులగణను "రాజకీయ ఉపకరణం"గా మార్చిందని దెప్పిపొడవకుండా వైష్ణవ్ వదలలేదు. రిజర్వేషన్లు కల్పించినప్పుడు వాటి ప్రధాన ఉద్దేశం ఆర్థిక ప్రయోజనం కల్పించడం కాదు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల వారికి మాత్రమే రాజ్యాంగంలో రిజర్వేషన్లకు అవకాశం కల్పించారు. అంటే ఆ సదుపాయం మొదట ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే దక్కింది. కానీ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించిన తరవాత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు డా. బీఆర్ అంబేద్కర్ సమాజంలో ఇతర వెనుకబడిన కులాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఆ తరవాతే ఈ అంశం పరిశీలించడానికి కాకా కాలేల్కర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి సర్వే చేసి నివేదిక తయారు చేసింది. కానీ ఆ నివేదిక నెహ్రూ ప్రభుత్వానికి సమర్పించిన కాకా కాలేల్కర్ ఈ నివేదిక మీద నమ్మకం లేదన్నారు. దానితో ఆ సిఫార్సులు అమలు చేసే అవకాశమే రాలేదు. ఆ తరవాత మండల్ కమిషన్ ఏర్పాటు, ఆ సిఫార్సులను చాలా ఏళ్ల అటక మీదే ఉంచేయడం, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఆ కవిలె కట్టలను కిందకు దించే దాకా ఇతర వెనుకబడిన తరగుతులవారు రిజర్వేషన్లు అమలుకే నోచుకోలేదు. ఆ సమయంలోనే వెనుకబడిన తరగతుల వారిలో సంపన్నులను రిజర్వేషన్ల నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టు నిర్దేశించడంతో రిజర్వేషన్ల వ్యవహారంలో ఆర్థిక అంశాలకు చోటు దక్కినట్టయింది. తాజాగా ఎస్సీ, ఎస్టీలకు వర్తించే రిజర్వేషన్లలోనూ సంపన్న శ్రేణిని మినహాయించాలన్న వాదనలు మొదలైనాయి. ఎస్సీలలో కూడా మళ్లీ అనేక కులాలు ఉన్నాయి. అందుకే ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలన్న ఉద్యమాలు సాగుతున్నాయి. ఏ వర్గానికి రిజర్వేషన్లు కల్పించినా అవి 50 శాతం కన్నా మించకూడదన్న నిబంధనా ఉంది. కొన్ని రాష్ట్రాలు ఏదో రకంగా మినహాయింపు సంపాదించాయి. ఎస్సీ వర్గీకరణ ఇప్పటికీ సమగ్రంగా ఒక కొలిక్కి రానే లేదు. ఇంతకాలం కులగణను బీజేపీ ఎందుకు వ్యతిరేకించిందో మంత్రివర్గ సమావేశాల వివరాలను తెలియజేసిన అశ్వినీ వైష్ణవ్ చెప్పనే లేదు. కానీ కాంగ్రెస్ మీద దాడి చేయడానికి సకలవిధ మాయోపాయాలు అనుసరించారు. కాంగ్రెస్ ఎప్పుడూ కులగణను వ్యతిరేకిస్తూనే వచ్చిందని చెప్పడం మాత్రం మరిచి పోలేదు. స్వాతంత్ర్యం తరవాత జరిగిన జనాభాలో లెక్కల్లో ఎప్పుడూ కులగణన అంశమే లేదని దెప్పి పొడిచారు. కులగణన అంశాన్ని పరిశీలిస్తామని 2010లో అప్పటి ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్ హామీ ఇచ్చారు. ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయినా కాంగ్రెస్ కులాలకు సంబంధించిన సర్వే మాత్రమే నిర్వహించిందనీ, కులగణన నిర్వహించనే లేదని అశ్వినీ వైష్ణవ్ కాంగ్రెస్ లోపాల దండకం చదివారు. ప్రతిపక్షాలతో కలిసి ఉన్నప్పుడు 2023లో నితీశ్ కుమార్ కులగణన నిర్వహించినప్పుడు బీహార్ గణాంకాల వాస్తవాలు దుమారం రేగింది. అనేక రాష్ట్రాలు, ప్రతిపక్షాలు కులగణన కోసం పట్టుబట్టాయి. అప్పుడూ బీజేపీ వ్యతిరేకిస్తూనే వచ్చింది. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని అధిగమించేందుకు అప్పుడు నితీశ్ ప్రభుత్వం అనేక సవరణలు చేసింది. ప్రభుత్వ ఉన్నతోద్యోగుల్లో, విద్యా సంస్థల్లో వెనుకబడిన తరగతులవారికి ఉన్న ప్రాధాన్యం నామ మాత్రమైందన్న వాస్తవం వెలికి వచ్చింది. అయినా బీజేపీ పట్టించుకోలేదు. బీహార్ ఎన్నికలు నవంబర్‌లో జరగాల్సి ఉన్నాయి కనక మోదీ ప్రభుత్వానికి హఠాత్తుగా కులగణకు సంబంధించి జ్ఞానోదయం అయినట్టుంది. నితీశ్ కుమార్ కులగణన నిర్వహించినప్పుడు బీహార్ బీజేపీ శాఖ కులగణనను సమర్థించిందన్న వాస్తవం కూడా మోదీ సర్కారుకు కనువిప్పు కలిగించి ఉండాలి.

సోషల్ మీడియా తోడేళ్లు

చేతిలో ఒక సెల్ ఫోన్ ఉంటే చాలు. ఎంతటి అశుద్ధాన్నైనా చిక్కగా కలిపి ఎదుటి వ్యక్తిపై చిమ్మొచ్చు. మాట్లాడేందుకు ఒక కెమెరా ఉంటే చాలు, నోటి శుభ్రత లేకుండా, పాచి పళ్లతోనే నోటి కొచ్చినట్లు ఎంతటి వారినైనా బండబూతులు తిట్టొచ్చు. బురద రాయొచ్చు. మలినాలు పూయొచ్చు. నిందలు వేయటమే పైశాచిక రాయుళ్ల పని. నీళ్లతోనో, నిప్పులతోనో కడుక్కోవటం, కాపాడుకోవటం బాధితుల పని. ఇది ఏపీలో జడలు విప్పిన సోషల్ మీడియా తోడేళ్ల వికృతోత్కృతిక పోకడ. బాహుబలి సినిమాలో మహిష్మతి సామ్రాజ్యంపైకి దండెత్తిన కీచక మూకలా సోషల్ మీడియాలో వీరి యుద్ధాలకు కొదవలేదు. మీరెవరు? వీరిని పోగేసింది ఎవరు? వీరికి ఆతిథ్యం ఇస్తున్నది ఎవరు? వీరి లక్ష్యం ఏమిటి? వీరికి పురుడు పోసి, బొడ్డు కోసి, పేరు పెట్టి, బారసాల చేసింది ఎవరు? అచ్చోసిన ఆంబోతుల్లా ఊరి మీదకో, జనాల మీదకో వదిలింది ఎవరు? నాలుగు గోడల మధ్య ఉన్న జీవితాలను నడిబజారుల్లోకి, భార్య భర్తల సంసారాలను నడిరోడ్డు మీదకు, వ్యక్తిగత గోప్యతను చిలువలు, పలువలుగా బట్టబయలు చేస్తున్నది ఎవరు ? 'శిలువ' వేస్తున్నది ఎవరు? వీటిపై బాధ్యత కలిగిన పౌర సమాజం, ప్రభుత్వం ఆలోచనలు చేయాలి.

నిజానికి ఈ ముష్కరమూకకు ఒకరినో, ఇద్దరినో బాధ్యులను చేయలేం. ఒక రాజకీయ పార్టీనో, రెండు రాజకీయ పార్టీలనో బోనులో నిలబెట్టలేం. అందరూ శాఖాహారులే. కానీ వారి మధ్య ఉన్న రొయ్యల గంప కనిపించటం లేదు అన్నట్లు అందరూ సోషల్ మీడియా నేరగాళ్లే. పైగా కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు సోషల్ మీడియా బారిన పడ్డ బాధితులు కూడా అందరూ. ముఖ్యంగా పెద్దవారే. సమాజంలో పేరున్న వారే. మహిళలు అరాచక శక్తులకు, సోషల్ మీడియా అంగళ్లకు ముడిసరుకులు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భార్య భారతీ రెడ్డి, చెల్లెలు షర్మిలా రెడ్డి అందరూ సోషల్ మీడియా బాధితులే. సమిధలే. అన్ని రాజకీయ పార్టీలలోని ముఖ్యమైన మహిళా నాయకులు కూడా సోషల్ మీడియా రథ చక్రాల కింద నలిగిపోతున్న వారే. దీని హననానికి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలూ లేకపోలేదు. ఈ ఆకృత్యాలపై చర్చలు జరగని రోజు కూడా లేదు. జనారణ్యాలలో ఉన్న ఈ తోడేళ్ల మందను తరమటం ఎలా? సభ్య సమాజంలోంచి వీరిని ఏడు సువ్వల గదుల్లోకి పంపటం ఎలా? బంధించటం ఎలా? అనే కార్యాచరణ ప్రభుత్వాలకు అవసరం. పల్లెల్లో గంజాయి మత్తులా, నగరాల్లో కొకైన్ అలవాటులా మారిన ఈ సోషల్ మీడియా మారక ద్రవ్య రుగ్మతల ముఠాలను నియంత్రించాల్సిన బాధ్యత చట్టాలపైనే ఉంది. ప్రభుత్వాలే ఇందుకు ఫుల్ స్టాప్ పెట్టాలి. లేకపోతే హననం ఆగదు. ఆడబిడ్డల ఆత్మహత్యలూ ఆగవు. గొప్పింటి బిడ్డల జీవితాలను రహదారులపై రచ్చబండ పెట్టి ఉతికి ఆరేయటమూ ఆగదు. మానరు.

పోతుల బాలకోటయ్య,
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

మేడే స్ఫూర్తితో పోరాట వారసత్వం కొనసాగాలి

> **భారతదేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు కార్మిక వర్గాన్ని వెంటాడి వేధిస్తున్నాయి. అమరవీరులు రక్త తర్పణంతో సాధించిన 8 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పాలకుల దన్నుతో ఎలాన్ మస్క్, నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం వంటి పారిశ్రామిక దిగ్గజాలు తిరిగి 70 నుంచి 90 గంటలు పని వారం తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారు.**

చలసాని వెంకటరామారావు

కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు 1848 లో కమ్యూనిస్టు ప్రణాళికను రచించారు. "కార్మికులకు పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప. ప్రపంచ కార్మికులారా ఏకంకండి!" అని ఉద్ఘోషించారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం సంఘటితం కావాలన్న వారి పిలుపు ప్రపంచ వ్యాపితంగా శ్రమ జీవులను ఐక్యం చేసింది. అనేక దేశాలలో ఎర్రజెండా ఆవిర్భావానికి దారి తీసింది. 1868లోనే ఇంగ్లీషు కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర కార్మిక సంస్థ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందుగా ఇంగ్లాండు కార్మిక వర్గం సంఖ్యాపరంగా పెద్దదిగా ఉండటంతో ముందుగా ఇంగ్లండులోనే ప్రారంభమైంది. ప్రపంచ కార్మికులను ఏకం చేసే ప్రయత్నం కూడా ఇంగ్లండులోనే ప్రారంభమైంది. ఇదే కాలంలో ఫ్రాన్సు, జర్మనీలలోని కార్మిక వర్గం సైతం జాగృతమై అనేక సమ్మె పోరాటాలు నిర్వహించాయి.

1864 సెప్టెంబరు 28 వ తేదీన లండన్‌లో సెయింట్ మార్టిన్ హాలులో వివిధ దేశాల కార్మిక వర్గ ప్రతినిధులతో మొట్టమొదటి కార్మిక సమావేశం జరిగింది. అనేక దేశాల కార్మిక వర్గ ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. స్వయంగా కార్ల్‌మార్క్స్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ వంటి దేశాల ప్రాతినిధ్యంతో "ఇంటర్ నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్" ఏర్పడింది. "కార్మిక వర్గం తన విముక్తిని తానే సాధించుకోవాలనే" సంకల్పంతో లక్ష్య సాధన దిశగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. ఆక్రమంలో 1886 అమెరికన్ కార్మికవర్గం ఎనిమిది గంటల పని విధానంకోసం పోరాటాన్ని ప్రారంభించింది. ఆనాటికే చికాగో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన నగరం. అనేక పారిశ్రామిక సంస్థలతో లక్షలాది మంది కార్మికులతో ఈ నగరం అభివృద్ధి చెందింది. అభివృద్ధితో పాటు అనేక దేశాల నుంచి ప్రజలు వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఇక్కడ ఆంగ్లో శాక్సన్ ప్రొటెస్టెంటుల ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం దీర్ఘకాలంపాటు సాగింది. జాతి, ఉపజాతి ఘర్షణలు అనేకం జరిగాయి. బయటి వారి సంఖ్య అధికంగా పెరిగిపోవటంతో స్థానిక ధనికవర్గాలు తమ ఆధిపత్యం పోతుందనే భయంతో "నో- నథింగ్స్" అనే పేరుతో ఒక రాజకీయ పార్టీని స్థాపించారు. డాక్టర్ లెవి డి.బూనే అనే వ్యక్తిని నగర మేయరుగా ఎన్నుకుని జాత్యహంకారంతో విదేశీయులను వెళ్లగొట్టాలనే ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒక అగ్ని ప్రమాదంలో లక్షమంది నిర్వాసితులవ్వగా అంతర్జాతీయంగా వచ్చిన సాయాన్ని దుర్వినియోగం చేశారు.

ఈ కాలంలోనే కార్మికులు తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. వారికి సరైన వేతనాలు ఇవ్వలేదు. 1872లో ఆకలిబాధతో కార్మికులు సహాయ శిబిరాలకు వస్తే వారిని ఒక సొరంగంలో బంధించి తీవ్ర హింసకు గురిచేశారు. ఇక్కడ అనేక మంది శ్రామికులు తమ ప్రాణాలను కోల్పోయారు. దీనినే 'రొట్టెల దొమ్మీ' అంటారు. ఈ క్రమంలో 1877లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె చికాగో నగరాన్ని అతలాకుతలం చేసింది. ముగ్గురు కార్మికులు చనిపోయారు. కార్మికులపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. దీనినే 'వైడక్టు యుద్ధం' అంటారు. చికాగోలో మెకార్మిక్ కార్మి సంఘం మొట్టమొదటిగా ఏర్పడింది. ఇక్కడే మొట్ట మొదట 8 గంటల పని డిమాండ్ చేస్తూ ఉద్యమం ప్రారంభమైంది. 1884 అక్టోబరు 7న చికాగోలో ఏర్పడిన కార్మిక సంఘాల సమాఖ్య 1886 మే 1 నుంచి ఎనిమిది గంటల పని అమలు చేయాలని లేకపోతే సమ్మె తప్పదని అల్టిమేటం ఇచ్చింది. ఆస్ట్రేలియా, లండన్, ప్యారిస్ నగరాలు సైతం స్పందించాయి. చివరకు మే 1 న అమెరికా, చికాగోలో సమ్మె ప్రారంభమైంది. చికాగో వీధులు ఎర్రజెండాలతో, కార్మికుల నినాదాలతో హోరెత్తాయి. బెంబేలెత్తిన పెట్టుబడిదారులు కార్మికోద్యమంపై ఉక్కు పాదం మోపారు. 3, 4 తేదీలలో హే మార్కెట్‌లో ఘర్షణలు చెలరేగాయి. కార్మికులు రక్తం

చిందించారు. పెట్టుబడిదారుల, పోలీసుల కుట్రల ఫలితంగా బాంబు పేలుడులో ఏడుగురు పోలీసులు సైతం చనిపోయారు. 15 మంది కార్మిక నాయకులను అరెస్టుచేసి నలుగురిని విచారించి ఉరితీశారు. చనిపోయిన కార్మికులను గూర్చి మాత్రం ఎవ్వరూ పట్టించుకోలేదు. 1889 జులై 14న అనేక దేశాల కమ్యూనిస్టు, సోషలిస్టు నాయకుల సమావేశం పారిస్‌లో జరిగింది. ఫ్రెంచి మార్క్సిస్టు గెమోలావిన్సే ప్రతిపాదన మేరకు 1890 మే 1 నుంచి ప్రపంచ కార్మిక దినోత్సవంగా ప్రపంచమంతా జరుగుతున్నది. నేడు 66 దేశాలు అధికారికంగా మేడేను ప్రకటించాయి. కానీ అమెరికా ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ మేడేని గుర్తించలేదు.

భారతదేశంలో 1862 లోనే 8 గంటల పనిదినం డిమాండ్‌తో కలకత్తాలోని హౌరా రైల్వేస్టేషన్ కార్మికులు 1200 మంది సమ్మె చేశారు. 1923లో మద్రాసు మెరీనా బీచ్‌లో సింగారవేలు చెట్టియార్, ట్రిప్లికేన్‌లో ఎస్.కృష్ణస్వామి శర్మ పెద్ద సంఖ్యలో హాజరైన కార్మికుల సమక్షంలో ఎర్రజెండా ఆవిష్కరించి మేడే జరిపారు. 1927లో బొంబాయి మున్సిపల్ కార్మికుల మేడే కార్యక్రమంలో ఎస్.ఎం.జోషి, ఎస్.ఎస్.మిరాజ్‌కర్, ఎస్.వి.ఘాటే పాల్గొన్నారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా మేడే ప్రతి సంవత్సరం జరుగుతున్నది. భారతదేశంలో 1877-1896 మధ్య నాగపూర్, సూరత్, బొంబాయి, కోయంబత్తూరు, అహ్మదాబాద్, కలకత్తా, మద్రాసులలో అనేక కార్మిక సమ్మెలు జరిగాయి. ప్రధానంగా స్పిన్నింగ్, కాటన్ మిల్లులలో ఈ సమ్మెలు జరిగాయి. ఎనిమిది గంటల పనిదినం ప్రధాన డిమాండ్‌గా ఈ సమ్మెలు జరిగాయి. 1920 లో ఏఐటీయూసీ స్థాపనతో కార్మిక సమ్మెల ఉధృతి పెరిగిపోయింది. 1881 లోనే కార్మిక సమ్మెల వెల్లువతో పెట్టుబడిదార్లు ఫ్యాక్టరీల చట్టం కావాలని బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఇంగ్లండులోని సామాజిక కార్యకర్తలు, దేశంలో కార్మిక పోరాటాల నేపథ్యంలో ఫ్యాక్టరీల చట్టం వచ్చి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పని గంటలు వచ్చాయి. 1920లో 10 గంటల పనిదినం, 1930-34 కార్మిక పోరాటాల వల్ల 9 గంటల పని వచ్చింది. 1948 లో 8 గంటల పని విధానాన్ని నాటి కాంగ్రెసు ప్రభుత్వం కార్మిక సంఘాల వత్తిడితో తీసుకు వచ్చింది. నాటి నుంచి నేటి వరకు భారతదేశంలో ఎనిమిది గంటల పని విధానమే అమలు జరుగుతున్నది.

1991 ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పని గంటలు పెంచాలనే చర్చ మొదలైంది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నినాదాలతో కార్మిక హక్కులను హరించి పని గంటలు పెంచాలని ప్రయత్నించారు. సెజ్‌ల పేరుతో కార్మిక చట్టాలకు విలువ లేకుండా చేశారు. దీనికి నిరసనగా భారత కార్మికవర్గం అనేకసార్లు దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలుచేసి అట్టి ప్రయత్నాలను తిప్పికొట్టింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలను, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు కుట్రలను తిప్పి కొట్టింది. సమ్మె హక్కు కోసం సైతం భారత కార్మిక వర్గం దేశ వ్యాప్త సమ్మెను చేపట్టింది. గత 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పక్కా కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. దశాబ్దాల పాటు భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చింది. కార్మికులను యాజమాన్యాలకు వేతన బానిసలుగా చేయాలని ప్రయత్నిస్తున్నది.

ప్రణాళికాబద్ధంగా అనేక దశాబ్దాలుగా నిర్మించుకున్న ప్రభుత్వ రంగాన్ని ధ్వంసంచేసి ప్రజా సంపదను పెట్టుబడిదార్ల సొంతం చేస్తున్నది. ఆయిల్, గ్యాస్, టెలికం, విమానాశ్రయాలు, బొగ్గు, ఇనుము, రైల్వేలు, పోర్టులతో పాటు బ్యాంకులు, బీమా రంగాలను, ఫార్మా కంపెనీలను, దేశ రక్షణ రంగాన్ని ప్రైవేటు పెట్టుబడిదార్లకు అప్పనంగా దోచి పెడుతున్నది. కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా వారికి లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేదలపై భారం వేస్తున్నారు. ఫిక్స్‌డ్ టైమ్ ఎంప్లాయిమెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్సు పేరుతో ఉద్యోగ భద్రతకు తిలోదకాలు ఇచ్చి కోట్లాది మంది కార్మికులను వీధుల పాలు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలలో ఆధునిక సాంకేతికత పేరతో రోబోట్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఎఐ) పేరుతో ఉద్యోగ భద్రతను, నూతన ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను ప్రశ్నార్థకం చేశారు. ఈ రంగాలలో వర్క్ ఫ్రం హోమ్ నిర్వహిస్తూ పనిలో లక్ష్యాలు నిర్ణయించి 15, 16 గంటలపాటు పనిచేయవలసిన అనివార్య పరిస్థితులు కల్పించారు. కార్మికుల, ఉద్యోగుల కనీస వేతనాలను ఎప్పటికప్పుడు నిర్ణయించటంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టి, "శుష్క వాగ్దానాలు, శూన్య హస్తాలు" అన్నట్లు కార్మికులను, పేదలను భ్రమల ప్రపంచంలో జీవింప చేస్తున్నారు. వారి జీవన ప్రమాణాల పెంపునకు ఎటువంటి చర్యలు లేవు.

నేడు ప్రజల కొనుగోలు శక్తికి పరిమితులు ఏర్పడి ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్నది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు సైతం కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయి. పరిమిత జీతాలు, పెన్షన్‌పై కోత, నిరుద్యోగం పెరుగుదల, కనీస వేతనాలు లేకపోవటం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. నిత్యం కార్మిక సమ్మెలు, ఆందోళనలు, భారీ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ధరల పెరుగుదల అడ్డూ అదుపు లేకుండా ఉన్నది. నేడు తిరిగి ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గం సంఘటితం కావల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భారతదేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు కార్మిక వర్గాన్ని వెంటాడి వేధిస్తున్నాయి. అమరవీరులు రక్త తర్పణంతో సాధించిన 8 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పాలకుల దన్నుతో ఎలాన్ మస్క్, నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం వంటి పారిశ్రామిక దిగ్గజాలు తిరిగి 70 నుంచి 90 గంటలు పని వారం తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారు. మేడే స్ఫూర్తితో పనిగంటలతో సహా కార్మిక హక్కులను, చట్టాలను సాధించుకోవాలి. కార్మికులు హక్కుల సాధనకు ఉద్యమించాలి. స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం, కార్మిక శ్రేయోరాజ్యం కోసం కార్మిక వర్గం పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి. పెట్టుబడిదారుల, పాలకుల కుట్రలను భగ్నం చేయాలి.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093

రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

జనవాణి

మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోవాలి. మనది సెక్యులర్ దేశం. భిన్నమతాలు, భిన్న ఆచారాలు, భిన్న సంస్కృతులు కలిగిన దేశం .కనుక ప్రభుత్వాలు ఏ మతానికి అనుకూలంగానూ, వ్యతిరేకంగాను పనిచేయకూడదు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉన్న మోదీ ప్రభుత్వం పాలనావ్యవహారాలలో ఒక మతానికి అనుకూలంగా మాట్లాడుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. అలాంటి భావనలకు అవకాశంలేకుండా పాలన కొనసాగాలి.

పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ వ్యవహారంలో కొంత మంది దూకుడుగా మాట్లాడటం చేస్తున్నారు. మతం మనిషిని ఉన్మాదిగా చేస్తుంది. అందరం మనుషులమే ! అనేభావన ప్రతి ఒక్కరిలో రావాలి. మతాలకు, కులాలకు వ్యతిరేకంగా ప్రాథమిక విద్య స్థాయిలోనే విద్యార్థులలో చైతన్యం రగిలించాలి. ఆస్పత్రిలో ఉన్న వ్యక్తికి రక్తం అవసరమయితే ఎవరి రక్తం ఇస్తున్నారో తెలియదుగదా! డాక్టరుదగ్గరకు వెళ్తే నీది ఏమతం, ఏకులం అని అడగరుగదా! ఆ విధంగానే మతాతీతంగా అలోచన పెరగాలి. కరోనా మహమ్మారి వ్యాపించినప్పుడు ఆర్థిక సమస్యల పేరుతో ప్రధాని మోదీ రైల్వేలో సీనియర్ సిటీజన్లు, జర్నలిస్టులకు ఇచ్చే రాయితీలు తొలగించారు. ఇప్పుడు ఉగ్రదాడి నెపంతో పాకిస్థాన్‌తో యుద్ధం వస్తే ఏమి తొలగిస్తాడో అని అందరూ ఆందోళన చెందుతున్నారు. అయినా మనకి ఎన్నో మహిమలు కలిగిన నాగసాధువులు, అఘోరీలు, మంత్రగాళ్లు, బేతాళమాంత్రికులు ఉన్నారు కదా ! వారిని ఆ దేశం మీద మంత్రాలూ, శాపాలు ప్రయోగించమని పిలుపు ఇవ్వవచ్చుగదా!

పార్లమెంటు నూతన భవనం ప్రారంభం రోజు మోదీగారు వందమండి బేతాళ మాంత్రికులను పిలిచారుకదా ! వారి వద్ద ఉన్న మహిమలను ఇప్పుడు ఉపయోగించుకొవాలి. అలాగే నాగసాధువులను వదిలితే పాకిస్థాన్ అంతు చూస్తారుగదా !! సైనికులతో పనేముంది? ఒక సారి వారి మహిమలను చూడాలని జనం కోరుకుంటున్నారు. ఇంతకంటే అవకాశం ఆ మహిమలను నిరూపించటానికి ఎప్పుడొస్తుంది ??

నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం, ఒంగోలు

కుదేలైన అమెరికా కంపెనీలు

చారుబత్ర రాయ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. దాదాపు 60,70 దేశాలపైన సుంకాలను అపారంగా పెంచి ఆయా దేశాల ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా అస్థిరీకరించారు. ప్రపంచ ఆర్థిక, వాణిజ్య ఘర్షణలకు అస్థిరీకరణకు అమెరికా ప్రధానమైన కారకురాలైంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. వాణిజ్య వ్యవస్థలో తీవ్రంగా తల్లకిందులయ్యాయి. ఆర్థిక వ్యవస్థ అస్థిరీకరణకు అమెరికా కారణమైందని చైనా తీవ్ర విమర్శచేసింది. అత్యధిక పరిశ్రమలు, కంపెనీలు గట్టిగా దెబ్బతిన్నాయి. దాదాపు 8నెలలుగా ప్రపంచ ఆర్థిక, వాణిజ్య ఘర్షణలకు అమెరికా హేతువైంది. అనేక ఏకపక్ష ఆంక్షలను అమెరికా విధించింది.

సుంకాలు, నియంత్రణలు గత రెండు నెలలుగా అనేక ఆంక్షలు విధించడం అమెరికాకే చెల్లిందని ఇది ప్రపంచ ఆర్థికవ్యవస్థను కుదేలు చేసిందని అంతర్జాతీయ వాణిజ్య అభివృద్ధి చైనా మండలి అంచనావేసింది. ఈ మండలి ప్రతినిధి ఝూవోపింగ్ మాట్లాడుతూ, రాగి దిగుమతులపైన అమెరికా దర్యాప్తులు ప్రారంభించిందని ఝూవో విమర్శించారు. అల్యూమినియం దిగుమతులపై సుంకాలు అపారంగా పెంచిందని చైనా పేర్కొన్నది. అమెరికా వాణిజ్య విధానాన్ని పెంపొందించేందుకు, అన్ని అంశాలలో అమెరికా ఫస్ట్ అని ట్రంప్ ప్రకటించారు. "పరస్పర వాణిజ్య సుంకాల విధింపునకు అమెరికా మెమోరాండాన్ని విడుదలచేసింది. అంతర్జాతీయ నియమ నిబంధనలు, విధివిధానాలకు, ప్రపంచ అభివృద్ధికి అమెరికా తీవ్రంగా అంతరాయం కలిగించింది. అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య వ్యవస్థకు సాధారణ ఉత్పత్తికి ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య నిర్వహణకు వివిధ దేశాలలో ప్రజల జీవనాన్ని, వినిమయాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ప్రపంచంలోని అన్ని వాణిజ్య దేశాలపైన అపరిమితంగా సుంకాలు విధించడం జరిగింది. సుంకాల విధింపు నుంచి చైనాను ఏమీ మినహాయించ లేదు. ఈ సుంకాలు విధించడంలోనూ వివిధ కారణాలను ట్రంప్ చెబుతున్నారు. ఈ చర్యలు బహుళ పక్ష వాణిజ్యవ్యవస్థ నియమనిబంధనల ఆధారంగా అమెరికా తీసుకున్న చర్యలు తీవ్ర ఇబ్బందులపాలయ్యాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరత దెబ్బతిని పోయింది.

అంతిమంగా వాణిజ్యం అమెరికాలోనూ, ఇతర దేశాలలోనూ సాధారణ ప్రజలపై ట్రంప్ చర్యల ప్రభావం ఏర్పడింది. అమెరికా సుంకాల విధింపుపైన చైనా విదేశాంగ వాణిజ్య పరిశ్రమల స్పందనపై ఝూవో వ్యాఖ్యానిస్తూ చైనా దేశ వ్యాప్తంగా 11వందల విదేశీ వాణిజ్య కంపెనీలను ప్రశ్నించగా, సుంకాల వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పాయి. సర్వేలో పాల్గొన్న కంపెనీలలో సగానికిపైగా అమెరికా కంపెనీలతో లావాదేవీలను తగ్గించనున్నామని చెప్పారు. సర్వేలో పాల్గొన్న అంతర్జాతీయ వాణిజ్య పరిశ్రమలు ఇలా స్పందించాయి. తరచుగా సుంకాల విధింపులలో మార్పులు అనిశ్చితిని పెంపొందిస్తాయి. దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకోవడం కష్టమవుతుందని స్పందించాయి. ఈ సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వ సమగ్ర విధానాల తోడ్పాటు మూలంగా విదేశీ వాణిజ్య పరిశ్రమలు అంతర్జాతీయ మార్కెట్లను చురుకుగా పరిశీలించడం దేశీయ విక్రయాలను ప్రస్తుత సవాళ్లను అధిగమించేందుకు కృషిచేయాలని పరిశ్రమలు భావించాయి. ఫిబ్రవరిలో ప్రపంచ ఆర్థిక, వాణిజ్య పరిశ్రమల సూచీని విడుదల చేసినట్లు ఝూవో తెలిపారు.

ఫిబ్రవరిలో ప్రపంచ ఆర్థిక, వాణిజ్య సూచీ 106పాయింట్లుగా నమోదైంది. ఈ ఘర్షణల్లో వస్తువుల విలువ సంవత్సరం తర్వాత సంవత్సరం తగ్గిపోతోంది. ఈ సంవత్సరం ప్రతి నెలా రెండు శాతం విలువ తగ్గిపోతోందని ఝూవో తెలిపారు. 20దేశాలు, ప్రాంతాల వాణిజ్య ప్రపంచ ఆర్థిక సూచీ అమెరికా, ఐరోపా, దక్షిణాఫ్రికా దేశాలలో అధికంగా నమోదైంది. 13భారీ పరిశ్రమలలో ఎలక్ట్రానిక్స్, జౌళి ఉత్పత్తి పరిశ్రమలు, రవాణా పరికరాలు, నాన్ ఫెర్రస్ లోహాలు, యంత్రాల ఉత్పత్తి పరిశ్రమలు, వాణిజ్య ఘర్షణల్లో పైస్థాయిలో ఉన్నాయి.

20 పర్యవేక్షణ దేశాలు, ప్రాంతాలలో 47 దిగుమతి సుంకాల విధింపు చర్యలలో 12 వాణిజ్య పరిష్కార దర్యాప్తులను నిర్వహించారు. చైనాకు సంబంధించిన వాణిజ్య సంఘర్షణలలో 19దేశాలు, ప్రాంతాలలో సూచీలు 152గా నమోదైంది. ఎలక్ట్రానిక్స్ తేలిక పరిశ్రమలు, యంత్రాలు, రవాణా పరికరాలు, జౌళి పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు చైనాలో అధికస్థాయి సంఘర్షణల సూచీలు నమోదయ్యాయి. ట్రంప్ విచ్చలవిడిగా విధించిన రుసుములను 100 రోజులు నిలిపివేశారు. చైనాపైన విధించిన అధిక రుసుముల అమలును కూడా ప్రస్తుతానికి నిలిపివేశారు. ఏదిఏమైనా ట్రంప్ ఇష్టానుసారం విధించిన సుంకాలను అమెరికాలోనూ ప్రజానీకం వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నిరసనలు నిర్వహించారు. అమెరికా ఐరోపా దేశాలతో మంచి సంబంధాలను కలిగిఉన్నది. అయితే ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత సుంకాల విధింపుపై ఐరోపా దేశాలు తీవ్ర ఆగ్రహంతోఉన్నాయి. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రతీకార సుంకాలను అనేక దేశాలు విధించాయి. భారతదేశానికిచెందిన అనేక దిగుమతుల పైన కూడా గణనీయంగా సుంకాలను విధించారు. అమెరికాలో ఆర్థిక సంక్షోభాన్ని సరిదిద్దేందుకే అధిక సుంకాలను దిగుమతులను విధించానని ట్రంప్ చెప్పారు. అయితే 100రోజుల సుంకాల అమలు నిలుపుదలతో భారత్ ఊరట పొందింది.

మోదీ రష్యా పర్యటన రద్దు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటన రద్దయింది. మే నెలలో రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో మోదీ పాల్గొనడం లేదు. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రకటించింది. భారత్–పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదని తెలుస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డే పేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా మోదీకి ఆహ్వానం అందింది. ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించారు.

పాక్ తప్పుడు ప్రచారం...
తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత నెట్టింట్లో పెద్దఎత్తున తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాకిస్థాన్ ఈ చర్యకు పూనుకుంటోంది. చివరకు భారత సైన్యం గురించి అసత్య వార్తలు ప్రచారం చేస్తోంది. ఉగ్రదాడి తర్వాత నార్తర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించారని, కస్టడీలోకి తీసుకున్నారని పాక్ అనుకూల సోషల్ మీడియాలో పోస్టులు దర్శనమిచ్చాయి. భద్రతా వైఫల్యం కారణంగా ఆ చర్యలు తీసుకున్నారని ప్రచారం చేసింది. పాక్ అసత్య ప్రచారాన్ని భారత్ తిప్పికొట్టింది. అవన్నీ నకిలీ వార్తలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తేల్చిచెప్పింది. సుచీంద్ర కుమార్ గురించి పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు తప్పుగా పేర్కొంటున్నాయని వెల్లడించింది. వాస్తవంగా ఏప్రిల్ 30న కుమార్ పదవీ విరమణ చేస్తున్నారు. ఆయన స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మ బాధ్యతలు చేపట్టనున్నారని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. నియంత్రణ రేఖ సమీపంలో భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాన్ని పాక్ సైన్యం కూల్చివేసినట్లు ఓ వార్త చక్కర్లు కొట్టింది. అది తప్పుడు కథనమని భారత్ తేల్చిచెప్పింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన అనేక యూట్యూబ్ ఛానెళ్లను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రభుత్వం ఓవైపు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నప్పటికీ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచేలా వీడియోలు సోషల్ మీడియాలో పుట్టుకొస్తున్నాయి. ఇటువంటి వాటిని పరిశీలించిన పీటీఐ వార్తా సంస్థ ఫ్యాక్ట్ చెక్ విభాగం... అందులో చాలా వీడియోలు నకిలీవని తేల్చింది.

అబ్రహాంపై సీబీఐ విచారణ
స్టే విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాన కార్యదర్శి కేఎం అబ్రహాం అక్రమాస్తుల ఆరోపణలపై సీబీఐ విచారణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. అబ్రహాం కేరళ మౌలికసదుపాయాల మూలధన నిధి బోర్డు (కేఐఐఎఫ్‌బీ) సీఈఓగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. అబ్రహాం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్‌మోహన్‌తో కూడిన ధర్మాసనం స్టే విధిస్తూ సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్‌లో కేరళ హైకోర్టు ఈ కేసులో అబ్రహాంపై విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది.

అంబేద్కర్- అఖిలేశ్ ఫొటోపై బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై బీజేపీ ఆరోపణలు గుప్పించింది. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ ఫొటోతో కలుపుతూ... అఖిలేశ్ యాదవ్ ఫొటో ఉన్న చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీజేపీ ఆయనపై విరుచుకుపడింది. భారత రాజ్యాంగ నిర్మాత చిత్రాన్ని సగానికి చేయడం ఆయనను అవమానించడమే అవుతుందని ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. అఖిలేశ్ యాదవ్ ఎన్ని జన్మలెత్తినా సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు సరితూగలేరని వ్యాఖ్యానించారు. ఎస్పీ నేతలు చేసే ఇటువంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. దీనిపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేశ్ పాఠక్ స్పందిస్తూ... అఖిలేశ్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎస్పీ నేతలు అంబేద్కర్‌ను, దళితులను అవమానించడానికి ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారని విమర్శించారు. అఖిలేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంక్షేమ పథకాలు రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి సైతం అఖిలేశ్ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ నేతలు చేసే మురికి రాజకీయాలకు ఇవన్నీ నిదర్శనాలని, ప్రజలు వారిని ఎన్నటికీ క్షమించరని అన్నారు.

పాక్ రక్షణలో హఫీజ్ సయీద్

ఇంటి కింద బంకర్‌లో నివాసం

న్యూఢిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై జరిపిన పాశవిక దాడి వెనక లష్కరే తోయిబా హస్తం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ దాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా... దీనికి కర్త, కర్మ, క్రియ అంతా లష్కరే తోయిబా అధ్యక్షుడు, భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ పరిణామాల వేళ హఫీజ్‌కు సంబంధించి ఓ సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. హఫీజ్ పాక్‌లో ప్రభుత్వ భద్రత మధ్య బహిరంగంగా జీవిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఓ ఆంగ్ల మీడియా వెల్లడించింది. సాధారణంగా ఉగ్ర నాయకులు ఎవరికీ తెలియని రహస్య ప్రదేశాల్లో దాక్కుని... అక్కడి నుంచే తమ కార్యకలాపాలకు సంబంధించి ఆదేశాలిస్తుంటారు. కానీ, హఫీజ్ సయీద్ జీవనం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. అతడు లాహోర్‌లోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీ ప్రాంతంలో సామాన్య పౌరులతో కలిసి నివసిస్తున్నట్లు సమాచారం. హఫీజ్ నివాసం వద్ద పాక్ ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తోంది. ఈ భవనంలో హఫీజ్ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఇంటిముందు ఓ ప్రైవేటు పార్క్, పక్కనే మసీదు, మదర్సా ఉన్నట్లు తెలుస్తోంది. భవనం కింద ఓ బంకర్ కూడా ఉన్నట్లు ఆ మీడియా పేర్కొంది. హఫీజ్ సయీద్ పాక్‌లో బహిరంగంగా తిరుగుతున్నట్లు కొంతకాలంగా కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ, పాక్ ప్రభుత్వం మాత్రం వాటిని తోసిపుచ్చుతోంది. ఉగ్ర సంస్థకు నిధులు సమకూర్చిన కేసులో అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడిందని, అతడు జైల్లోనే ఉన్నాడని బుకాయిస్తోంది. 2019లో హఫీజ్ అరెస్టయినట్లు కథనాలు వచ్చాయి. ఆ మధ్య హఫీజ్ అనుచరులు, లష్కరే ఉగ్రవాదుల వరుస హత్యలు చోటుచేసుకున్నాయి. ఆ పరిణామాలతో అతడికి పాకిస్థాన్ భద్రత పెంచినట్లు తెలుస్తోంది. అతడి ఇంటినే సబ్‌జైలుగా మార్చినట్లు వార్తలు వినిపించాయి. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను... ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది.

ఫరూఖ్ నెట్‌వర్క్‌తో పహల్గాం దాడి

ఎన్ఐఏ వెల్లడి

శ్రీనగర్: పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేయడానికి కశ్మీర్ నుంచి పారిపోయి పాక్‌లో స్థిరపడిన ఓ ఉగ్రవాది నెట్‌వర్క్ సాయపడినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గుర్తించింది. లష్కరే తోయిబాకు చెందిన కమాండర్ ఫరూఖ్ అహ్మద్ తేద్వా ఈ దాడిలో కీలకపాత్ర పోషించినట్లు భావిస్తున్నారు. ఇటీవలే భద్రతా దళాలు కుప్వారాలో అతడి ఇంటిని పేల్చివేశాయి. గత రెండేళ్లలో కశ్మీర్‌లో చాలా ఉగ్రదాడులకు అతడు సాయం చేసినట్లు గుర్తించారు. ఫరూఖ్‌కు కశ్మీర్‌లోని పర్వతాలు, లోయల్లో మార్గాలపై పట్టు ఉంది. అతడే మూడు మార్గాల ద్వారా ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సాయం చేశాడు. ఇతడికి పాక్‌లో బలమైన సంబంధాలున్నాయి. 1990–2016 మధ్య రెండుదేశాలకు పలుమార్లు ప్రయాణించాడు. పహల్గాంలోని ఉగ్రదాడి తర్వాత అతడికి సాయం చేసిన కొంతమందిని అదుపులోకి తీసుకొన్నారు. ప్రస్తుతం పాక్‌లో స్థిరపడిన ఫరూఖ్... కశ్మీర్‌లోని తన నెట్‌వర్క్‌తో సంబంధాలు పెట్టుకొనేందుకు సెక్యూర్డ్ కమ్యూనికేషన్ యాప్స్‌ను వినియోగిస్తున్నాడు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సాధారణంగా ట్రెక్కింగ్‌కు పర్వతారోహకులు వినియోగించే అల్పైన్ క్వెస్ట్ వంటి నేవిగేషన్ యాప్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో వినియోగించినట్లు భావిస్తున్నారు. దీంతో ఉగ్రవాదులను గుర్తించడం కష్టంగా మారింది. దీనికితోడు ఉగ్రవాదుల వద్ద అల్ట్రాసెట్లు ఉన్నట్లు గుర్తించారు. 2023 నుంచి కశ్మీర్ లోయలో ముష్కరులు వీటిని వాడుతున్నారు. ఇవి సాధారణంగా జీఎస్ఎం, సీడీఎంఏ ఫోన్లలా పనిచేయవు. వీటిని ఫోన్లకు అనుసంధానించి... ప్రత్యేకమైన రేడియో నెట్‌వర్క్ ద్వారా ఎన్‌క్రిప్టెడ్ సందేశాలు పంపించవచ్చు. గతంలో కేవలం మెసేజ్‌లకు మాత్రమే వినియోగించేవారు. ఇప్పుడు వీటిద్వారా చిన్నచిన్న వాయిస్‌నోట్‌లు, వీడియోలు పంపించడానికి వాడుతున్నారు. ఒకవేళ అల్ట్రాసెట్ సిగ్నల్‌ను పసిగట్టినా... అది కచ్చితమైన ప్రదేశం చూపించదు. దీంతో దాదాపు 5–10 కిలోమీటర్ల వ్యాసార్థంలో గాలింపు చర్యలు చేపట్టాల్సి ఉంది. పహల్గాం దాడి తర్వాత ఇలా సిగ్నల్స్‌ను పసిగట్టినా... కచ్చితమైన ప్రదేశాన్ని మాత్రం గుర్తించలేదు.

ఆ నీళ్లు మాకివ్వండి

పంజాబ్‌కు హర్యానా విజ్ఞప్తి

చండీగఢ్: పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హర్యానా కోరింది. లేకపోతే... ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఓ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది ఒకటి. 'జూన్ నాటికి భాక్రానంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలు నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే... అదనపు జలాలు హరి–కె–పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్... ఇటు హర్యానాకు ఉపయోగపడదు. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో ఢిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. హర్యానాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీకి పోగా హర్యానాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హర్యానాకు రావాల్సిన వాటా ఇచ్చినా... అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం' అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హర్యానా, రాజస్థాన్ నీటి అవసరాలు తీరుస్తోంది.

చోక్సీకి నాన్‌బెయిలబుల్ వారెంట్

ముంబై: కెనరాబ్యాంక్ కన్సార్టియం మోసం కేసులో నిందితుడు మెహుల్‌చోక్సీకి ముంబై కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆర్‌బీ ఠాకూర్ బుధవారం ఈ ఆదేశాలిచ్చారు. వారెంట్‌పై నివేదిక కోసం ఈ అంశాన్ని జూన్ 2కి వాయిదా వేశారు. బెజెల్ జ్యువెలరీకి కన్సార్టియం ఒప్పందం కింద కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వరుసగా రూ.30 కోట్లు, రూ.25 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేసినట్లు సీబీఐ పేర్కొంది. బంగారం, వజ్రాల ఆభరణాల తయారీ, అమ్మకం కోసం ఈ రుణాన్ని మంజూరు చేశారు. కానీ కంపెనీ ఆ రుణాన్ని ఆ ప్రయోజనాల కోసం వినియోగించలేదని తెలిపింది. రుణాన్ని తిరిగి చెల్లించలేదని, దీంతో కన్సార్టియంకు రూ.55.27 కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తాంజలి గ్రూప్ యజమాని అయిన చోక్సీ తన మేనల్లుడు నీరవ్ మోదీ, ఆయన సోదరుడు నిషాల్ మోదీతో కలిసి పీఎన్‌బీకి రూ.13,500 కోట్ల పైగా కన్నం పెట్టారు. మోసం బయటపడటానికి ముందు 2018లో భారత్‌ను విడిచి పారిపోయారు. చోక్సీని పట్టుకునేందుకు ఏడేళ్లుగా భారత దర్యాప్తు సంస్థలు ప్రయత్నించాయి. ఈ ఆర్థిక నేరగాడి కదలికలపై నిఘా పెడుతూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు బెల్జియంలో అరెస్ట్ అయ్యేలా చేశారు. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు చోక్సీ ప్రణాళిక వేస్తున్న సమయంలో ఏప్రిల్ 12న బెల్జియం పోలీసులు అరెస్ట్ చేశారు.

పాక్‌పై భారత్ ఆర్థిక యుద్ధం

రుణం ఇవ్వొద్దని ఐఎంఎఫ్‌కు వినతి

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో ప్రతీకారంతో రగిలిపోతున్న భారత్... పాకిస్థాన్‌ను ఆర్థికంగా మరింత ఇబ్బందే పెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా దాయాది దేశంపై భారత్ ఆర్థిక యుద్ధం ప్రకటించింది.

పాకిస్థాన్‌కు అప్పు ఇవ్వొద్దంటూ భారత్ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పై ఒత్తిడి చేస్తోంది. ఆ మేరకు అభ్యంతరం తెలిపింది. గతేడాదిలో ప్రకటించిన పాకిస్థాన్‌కు ఏడు బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ విషయంలో సమీక్షించాలని కోరింది. పాక్‌కు నిధులు ఇస్తే ఉగ్రవాదులకు మళ్లిస్తోందని ఐఎంఎఫ్ సభ్యులకు భారత్ వివరించింది. మే 9న పాకిస్థాన్‌కు అప్పు ఇచ్చే అంశంపై ఐఎంఎఫ్ బోర్డు చర్చించనుంది.

ఈ తరుణంలో పాక్‌కు ఎట్టి పరిస్థితుల్లో అప్పు ఇవ్వొద్దని భారత్ వాదిస్తోంది. ఇదే అంశంపై భద్రతామండలి నాన్ పర్మినెంట్ మెంబర్స్‌తో భారత విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ చర్చలు జరుపుతున్నారు. పాకిస్థాన్‌కు ఏడు బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీని సమీక్షించాలని కోరనున్నారు.

హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం...14మంది మృతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఓ హోటల్‌లో మంగళవారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 14 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 13మంది గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆరు అంతస్తుల హోటల్‌ను చుట్టుముట్టిన మంటలను అదుపులోకి తెచ్చారు. రాత్రి 8.15 గంటల ప్రాంతంలో రితురాజ్ హోటల్ ఆవరణలో మంటలు ఎగిసిపడ్డట్లు సమాచారం అందిందని కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ చెప్పారు. ప్రాణభయంతో అనేకమంది భవనం కిటికీలు, ఇరుకైన గోడల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారని... నాలుగో అంతస్తు నుంచి కొందరు కిందకు దూకగా గాయపడ్డారని తెలిపారు. ప్రమాదంలో 14 మంది మృతదేహాలను వెలికి తీశామని... అనేకమందిని రక్షించినట్లు తెలిపారు. మృతి చెందినవారిలో ఎక్కువమంది దట్టంగా వ్యాపించిన పొగ వల్ల ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారన్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశాల మేరకు అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి నిర్దిష్ట కారణాలు తెలియవన్నారు. అయితే షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు సంభవించాయని అనుమానిస్తున్నట్లు చెప్పారు. అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పది ఫైర్ ఇంజిన్లు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. అయితే, ఈ ప్రాంతం రద్దీగా ఉండడంతో ఫైర్ ఇంజిన్లు అక్కడికి చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. ఇక మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. బుర్రాబజార్‌కు అతిపెద్ద హోల్‌సేల్ మార్కెట్‌గా పేరుంది. కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అగ్నిప్రమాదంల జరిగిన సమయంలో 42 గదుల్లో 88మంది అతిథులు ఉన్నట్లు హోటల్ నిర్వాహకులు తెలిపారు.

ప్రధాని మోదీ విచారం

అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున గాయపడిన వారికి రూ.50వేల చొప్పున పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి పరిహారం ప్రకటించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ప్రమాదంపై సంతాపం ప్రకటించారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకర సంఘటనలు జరగకుండా అగ్నిమాపక భద్రతా చర్యలను క్షుణ్ణంగా సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శుభాంకర్ సర్కార్ మాట్లాడుతూ... కోల్‌కతా కార్పొరేషన్‌పై మండిపడ్డారు. విచారకరమైన సంఘటన అని... చాలా మంది ఇప్పటికీ భవనంలో చిక్కుకున్నారని... కనీస భద్రత లేదని మండిపడ్డారు. కార్పొరేషన్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాగా అగ్నిప్రమాద నివారణ ప్రమాణాలను హోటల్ యాజమాన్యం పాటించలేదని తెలుస్తోంది.

దేశ రక్షణకు సరైన చర్యలు

పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలి: ఖర్గే

బెంగళూరు: ప్రజల భావాలను గౌరవిస్తూ దేశ సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచన చేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సాధ్యమైనంత తర్వగా సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చేపట్టే ఆపరేషన్ కోసం రాజకీయ పార్టీలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఉగ్ర దాడిపై చర్చ, ఐక్య తీర్మానానికిగాను పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలి. ప్రధాని హాజరు కావాలి. ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్నది సీక్రెట్ ఆపరేషన్ల క్రమంలో బహిర్గతం చేయనక్కర్లేదు కానీ తాజా పరిస్థితుల దృష్ట్యా ఆయన తన మనస్సులోని మాటను ఫ్లోర్ లీడర్లతో పంచుకోవాలి' అని విలేకరులతో మాట్లాడిన ఖర్గే అన్నారు. పాకిస్థాన్‌పై చర్యలకు కేంద్రానికి సర్వాధికారం ఉందన్నారు. దేశ పౌరులకు, సైనికులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఇప్పటికే ప్రధానికి స్పష్టం చేసినట్లు తెలిపారు. పాకిస్థాన్‌ను నియంత్రించేందుకు కేంద్రానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఖర్గే వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ 'గాయబ్' పోస్టులపై విమర్శలపై స్పందిస్తూ ఎవరి ప్రతిష్ఠకు భంగం కలిగించడం సరైనది కాదని అన్నారు. 'గాయాబ్' పోస్టుల వివాదంపై ఓ విలేకరి ప్రశ్నించగా 'నేను చూడలేదు...ఏమీ చెప్పలేను' అని ఖర్గే బదులిచ్చారు. 'ఓ వ్యక్తి ప్రధాని లేక మరే నాయకుడా అన్నది కాదు. ఎవరి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టరాదు. అలా బీజేపీ చేసినా లేక కాంగ్రెస్ చేసినా తప్పే' అని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్ నేతల వివాదాస్పద ప్రకటనలపై ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ పార్టీ నాయకులకు ఇప్పటికే తగు సూచనలు, మార్గదర్శకాలు చేసినట్లు వెల్లడించారు.

పార్లమెంటు ప్రత్యేక భేటీ డిమాండ్‌కు
శరద్‌పవార్ మద్దతు

థానే: పహల్గాం ఉగ్రవాద దాడిపై చర్చించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించాలనే కాంగ్రెస్ డిమాండ్‌కు ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ మద్దతు పలికారు. ఈ సమయంలో పార్లమెంటు ప్రత్యేకంగా భేటీ కావడం... ప్రపంచానికి దేశం ఐక్యంగా ఉందనే సందేశాన్ని పంపుతుందన్నారు. థానేలోని తుల్జా భవానీ ఆలయంలో బుధవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పవార్ విలేకరులతో మాట్లాడారు. పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యను దేశంపై దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ విషయంలో కేంద్రం ఏ చర్యలు తీసుకున్నా తాను మద్దతు ఇస్తానన్నారు. 'మా సహచరులు కొందరు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల కోసం డిమాండ్ చేశారు. ఈ అంశంపై మొత్తం దేశం ఐక్యంగా ఉంది. అన్ని పార్టీలు, పార్లమెంట్ ఐక్యంగా ఉన్నాయి. పహల్గాం ఘటనపై ఈ సందేశాన్ని ప్రపంచానికి పంపడానికి ప్రత్యేక సమావేశం ఉపయోగపడుతుంది' అని పవార్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడిపై చర్చించడానికి, సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసిన సంగతి విదితమే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రివర్గం తీసుకునే ఏ చర్యలకైనా తాము పూర్తి మద్దతు ఇస్తామని పవార్ స్పష్టం చేశారు. మతం, కులం, భాషను అటువంటి విషయాల్లోకి తీసుకురావద్దని అన్నారు. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు నాయకత్వం వహిస్తున్న అతని బంధువు రాజ్‌ఠాక్రే మధ్య సయోధ్యకు అవకాశం ఉందా అని ప్రశ్నించగా... 'అలా జరిగితే మంచిదే. రెండు కుటుంబాలు కలిసి వచ్చినప్పుడు, అది ఎప్పుడూ సానుకూల పరిణామం' అని పవార్ అన్నారు. ఎంపిక చేసిన మతపరమైన కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతారా అని అడగ్గా... అది నిజం కాదని పవార్ చెబుతూ... 'నేను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా...పండర్‌పూర్ ఆలయంలో అనేకసార్లు పూజ చేశా. తుల్జాపూర్‌లోని తుల్జా భవానీ ఆలయాన్ని కూడా చాలాసార్లు సందర్శించాను' అన్నారు.

అటారీ-వాఘా సరిహద్దు మూసివేత

న్యూఢిల్లీ: పంజాబ్‌లోని అటారీ–వాఘా సరిహద్దు గుండా ఏప్రిల్ 24–29 మధ్య 786 మంది పాకిస్థానీయులు స్వదేశానికి వెళ్లగా... అదే సమయంలో అక్కడి నుంచి 1,376 మంది భారతీయులు తిరిగి ఇండియా వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు ఏప్రిల్ 26లోపు దేశాన్ని వీడాలని కేంద్రం ఇటీవల ఆదేశించింది. వైద్య వీసాల కింద వచ్చినవారికి 29 వరకు గడువు ఇచ్చింది. బిజినెస్, విజిటర్, స్టూడెంట్ తదితర 12 విభాగాల్లో వీసాలు ఉన్నవారు 27 నాటికి వెళ్లిపోవాలని స్పష్టంచేసింది. దీంతో ఎన్నోఏళ్లుగా భారత్‌లో నివసిస్తున్న పాక్ పౌరులు తమ కుటుంబాలను వదిలి స్వదేశానికి తిరిగి వెళ్తుండడంతో సరిహద్దుల వల్ల భావోద్వేగ వాతావరణం నెలకొంది. 29తో భారత ప్రభుత్వం అక్కడి పౌరులకు ఇచ్చిన గడువు ముగిసిపోయింది. ఇందులోభాగంగానే సార్క్ వీసా పథకం ద్వారా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ వాసుల్ని 48 గంటల్లోగా తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించింది. గడువు ముగిసిపోవడంతో కేంద్రం ఆదేశాల మేరకు బుధవారం అధికారులు అటారీ- వాఘా సరిహద్దును మూసివేశారు. ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన 'ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్- 2025' ప్రకారం... గడువు తీరినా ఇక్కడే ఉండటం, వీసా నిబంధనలు ఉల్లంఘించడం, నిషేధిత ప్రాంతాలను సందర్శించడం వంటి సందర్భాల్లో మూడేళ్ల జైలుశిక్ష, రూ.మూడు లక్షల వరకు జరిమానా విధిస్తామని భారత ప్రభుత్వం పాక్ దేశస్థులను హెచ్చరించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ కఠిన చర్యలు తీసుకుంది. ఇందులోభాగంగా ఆయా వీసాల కింద భారత్‌లో ఉన్న పాక్ పౌరులను నిర్ణీత గడువులోగా స్వదేశానికి వెళ్లిపోవాలని ఆదేశించింది.

నేటి నుంచి హైకోర్టు సెలవులు

ఐదుగురు న్యాయమూర్తుల పదవీ విరమణ

చెన్నై: మద్రాసు హైకోర్టుకు మే ఒకటో తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. సెలవు దినాల్లో సెలవు కాలపు కోర్టులు పనిచేస్తాయని హైకోర్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా హైకోర్టు న్యాయమూర్తులు ఎస్.సుందర్, భవానీ సుబ్బురాయన్, హేమలత, నక్కీరన్, శివజ్ఞానం బుధవారం హైకోర్టు ప్రాంగణంలో పదవీ విరమణ చేశారు. వీరికి వీడ్కోలు సభ నిర్వహించనున్నారు. ఈ ఐదుగురి పదవీ విరమణతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 60కి తగ్గింది. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అత్యవసర కేసులపై న్యాయమూర్తులు మాలా, అరుళ్‌మురుగన్, విక్టోరియా గౌరీ తదితరులు, 14, 15, 21 తేదీల్లో న్యాయమూర్తులు లక్ష్మీ నారాయణన్, నిర్మల్‌కుమార్, స్వామినాథన్ తదితరులు , 28, 29 తేదీల్లో న్యాయమూర్తులు సత్యనారాయణ ప్రసాద్, సెంథిల్‌కుమార్, రామమూర్తి, తిలకవతి తదితరులు విచారణ జరుపుతారు. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో న్యాయమూర్తులు బాలాజీ, జ్యోతిరామన్, శక్తివేల్, రామకృష్ణన్, వేల్‌మురుగన్, పూర్ణిమ, రాజశేఖర్, శ్రీమతి, విజయకుమార్, వడమలై, షమీన్ అహమ్మద్, ఆనంద్ వెంకటేష్, దండపాణి వేసవి కాలపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమ్మెను విరమించుకోవాలి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న నేపథ్యంలో ఆర్టీసి కార్మికులు సమ్మెకు దిగడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రస్తుత సమయంలో కార్మికుల సమ్మెకు దిగడం వల్ల ఇప్పుడిప్పుడే గాడిన పడి లాభాల బాట పడుతున్న ఆర్టీసి పై పెనుభారం పడుతుందని అన్నారు. మే7వ తేది నుండి ఆర్టీసీ కార్మికుల సమ్మె పై మంత్రి స్పందిస్తూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అయన స్పష్టం చేశారు. ఏ సమస్య అయినా పరిష్కారం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల పోరాటంతో తెలంగాణ సాధించబడిరదని అయన గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన తరువాత 10 సంవత్సరాలు ఏం జరిగిందో అందరికీ తెలుసని గత పాలకులు ఆర్టీసీని ఎలా నిర్వీర్యం చేశారో మనముందు కనిపిస్తుందన్నారు. ఇప్పుడు కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు ఆర్టీసీ తార్నాక ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీగా మార్చి అందరిని అందుబాటులోకి తెచ్చామన్నారు. వారి పెండిరగ్ బకాయిలు టీఏ, డీఏలు ఇచ్చామని త్వరలో కొత్త నియామకాలు చేపట్టడంతో పాటు కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడిరచారు. మూడు ప్రధాన అంశాలు ప్రయాణికుల సౌకర్యం, కార్మికుల సంక్షేమం ఆర్టీసీ సంస్థ పరిరక్షణగా ముందుకు పోతున్నామని ఇలాంటి సమయంలో సమ్మెకు పోవడం వల్ల ఇబ్బందులు వస్తాయన్నారు. వారి రెండు ప్రధాన అంశాలు ముఖ్యమంత్రి నోటీసులో ఉన్నాయని, వాటిని కూర్చొని మాట్లాడుకోవాలని ట్రేడ్ యూనియన్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. రూ.1562 కోట్ల పిఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు తగ్గించడంతో పాటు సిసిఎస్ బకాలను పూర్తిగా తగ్గించేసామని వివరించారు. రిటైర్మెంట్ అయ్యే వారికి రిటైర్ అయిన రోజే వారి బెనిఫిట్స్ ఇవ్వాలని కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల్లో బకాయిలు ఉన్న నేపథ్యంలో సంస్థ నిలబడాల్సిన అవసరం చాలా వుందని, ఆర్టీసీ సంస్థ వల్ల 40,000 కుటుంబాలు బాగుపడాలని ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. సంస్థను ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి సానుకూల దృక్పథంతో ముందుకు పోతున్నామని వివరించారు. కావున కార్మిక సంఘాల నాయకులు ఆర్టీసీ సమ్మె పునరాలోచన చేయాలని, ముందుగా ఎలాంటి విజ్ఞప్తి చేయకుండా నేరుగా సమ్మె చేయడం సరికాదన్నారు.

పశ్య కన్నమ్మ మృతి పట్ల ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు రజిని సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహిళా సమాఖ్య నల్గొండ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా అలాగే రాష్ట్ర మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులుగా దీర్ఘకాలం పని చేయడమే కాక తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పోరాడిన వీర మహిళ పశ్య కన్నమ్మ మరణ వార్త చాలా దిగ్భ్రాంతి కరమని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.రజిని పేర్కొన్నారు. వీరి మృతికి భారత జాతీయ మహిళా సమాఖ్య విచారణ వ్యక్తం చేస్తుందని, జాతీయ మహిళా సమాఖ్య కౌన్సిల్ సంతాపం ఆమె కుటుంబానికి ప్రత్యేకంగా ఉమ్మడి రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా పని చేసిన పశ్య పద్మకి సంతాపం తెలియజేశారు.

బసవేశ్వర ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ జి ముకుంద రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా శ్రీ బసవేశ్వర ఆశయాలకు అనుగుణంగా నేటి తరం నడుచు కోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ జి ముకుంద రెడ్డి అన్నారు. బుధవారం మహాత్మా శ్రీ బసవేశ్వర 892 పురస్కరించు కొని కలెక్టరేట్ విసి హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుని ఆశయాల ప్రకారం అందరు నడుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ సికింద్రాబాద్ హాలో చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అతిగా మార్కులు సాధించిన విద్యార్థులు బి.నందు, జె. కేదారి నాథ్, ఎం శివకుమార్ లకు శాలువా కప్పి సన్మానించి మేమెంటో బహుకరించారు. అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ అభినందిస్తూ తోటి నలుగురికి సహాయం చేయాలని అప్పుడే బసవేశ్వరుని ఆశీస్సులు అందుతాయని అన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులు తిరుపతి,ఎం రాధికలను అదనపు కలెక్టర్ సన్మానించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతి, ఎం రాధిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెలంతా వేసవి సెలవులు కమీషనర్ క్రాంతీ వెస్లీ ప్రకటించిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోయేషన్ (ఏఐటీయుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి, రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్‌లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమీషనర్ ఎ.క్రాంతి వెస్లీతో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోయేషన్ (ఏఐటీయుసి), ఇతర సంఘాలతో జరిపిన చర్చలలో వేసవి కారణంగా తల్లులకు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటానికి కష్టతరంగా ఉందని, లబ్ధిదారులకు టేక్ హోంరేషన్ ఇచ్చి సెలవులు ప్రకటించాలని వినతి మేరకు కమీషనర్ సానుకూలంగా స్పందించి వేసవి సెలవులు మే నెలంతా ప్రకటించినందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు, కమీషనర్‌కు, అధికారులకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేన్ (ఏఐటీయుసి) తరఫున ధన్యవాదాలు తెలిపారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ 2 లక్షలు టీచర్‌కు, ఆయాకు లక్ష రూపాయలు చెల్లించాలని, రిటైర్ అయిన టీచర్లందరికి వెంటనే రిటైర్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, ప్రతినెలా సెంటర్ అద్దెలు, ఆరోగ్య లక్ష్మీ బిల్లులు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని కోరగా వేసవి సెలవుల అనంతరం పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెంచాలని, ఇప్పటి వరకు ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు ప్రమోట్‌చేయడానికి కృషి చేయాలని కమీషనర్ కోరారు.

ఐసీఐసీఐతో న్యాక్ ఎంఓయూ ఒప్పందం

స్కిల్ డెవలప్‌మెంట్‌కు సీఎం రేవంత్ అధిక ప్రాధాన్యత : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఐసీఐసీఐ బ్యాంక్‌తో న్యాక్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా న్యాక్ వైస్ చైర్మన్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, న్యాక్ ఎండి ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ హరించందన, ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిలో వివిధ కోర్స్‌లో 25 వేల మందికి ట్రెనింగ్ ఇచ్చామని తెలిపారు. ఈ సంఖ్యను రానున్న రోజుల్లో పెంచుతామని, ఇందులో 99 శాతం మందికి పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని వివరించారు. రాష్ట్రంలో 10 ఉమ్మడి జిల్లాలో న్యాక్ రీజనల్ కేంద్రాలు ఏర్పాటు చేసామని, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సీఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడిరచారు. స్కిల్స్ ట్రెనింగ్ పెంచాలని, ముఖ్యంగా రూరల్ యూత్‌కి స్కిల్ ట్రెనింగ్ పెంచాలని సీఎం చెబుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ స్కీమ్‌కి మహిళ మెస్త్రిలకు ట్రెనింగ్ ఇచ్చామని, స్కిల్ ట్రెనింగ్ అనేది ఇది కోర్స్, డిగ్రీ కాదు అనే విషయం గమనించాని సూచించారు. నిత్యం స్కిల్స్ నేర్చుకుంటూ ఉండాలని, జీవితం అంటేనే నిత్యం నేర్చు కోవడం అని వ్యాఖ్యానించారు. న్యాక్‌లో చాలా కార్యక్రమలు అటెండ్ ఆయానని, దేశంలో పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య అని చెపుకొచ్చారు. ఉద్యోగాలు లేక యువత డ్రగ్స్‌కు బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సినిమా టెక్నీషియన్‌కు న్యాక్‌లో ట్రెనింగ్ ఇస్తామని, త్వరలో దిల్ రాజు, సినిమా వాళ్ళతో మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిగ్రీ తీసుకొని బయటకు వచ్చాక స్కిల్స్ ఉండటం లేదని, యూపీ, బీహార్ కార్మికులు హైదరాబాద్ వచ్చి పని చేస్తూ నెలకి రూ.50 వేలు సంపాదిస్తున్నారని, ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వాళ్ళు న్యాక్‌లో ట్రెనింగ్ తీసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరకు నిత్యం నిరుద్యోగులు వచ్చి ఉద్యోగాలు కల్పించమని కోరుతున్నారని, మేము జాబ్‌లు ఇవ్వాలని కంపెనీలకు రిఫర్ చేస్తే స్కిల్స్ ఉన్న వాళ్ళను పంపాలని కంపెనీలు మముల్ని కోరుతున్నాయన్నారు. అందుకే ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేస్తుందని కావున నిరుద్యోగ యువత దీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మంది బ్యాచ్‌కు మంత్రి కోమటిరెడ్డి సర్టిఫికెట్‌లు అందచేశారు.

ధాన్యం కొనుగోలులో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : యసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఎర్రమంజిల్ కాలనీ పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖా రూపొందించిన విధి విధానాలను విస్తరిస్తున్న పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహన్ ధాన్యం కొనుగోళ్లు సునిశితమైన అంశం, ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎటువంటి అవాంతరాలు కలుగకుండా చూసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రానున్న 15-20 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉధృతంగా ఉంటాయి, ఈ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గోడౌన్‌లు అందుబాటులో లేని చోట అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాలి. 54.89 లక్షల ఎకరాల్లో రబీ సాగు 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా 70.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు అందుబాటులో సరిపడా గన్నీ బ్యాగులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామన్నారు. 2021-22ను పోల్చి చూస్తే ఈ రబీ సీజన్‌లో అదనంగా 1,772 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్నాలకు సత్వరమే బోనస్ చెల్లింపులు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయాలని మంత్రి తెలిపారు. ఈ కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, సిపిఓ శేఖర్ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.వి.కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగ, కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. ఉద్యోగుల హెల్త్ కార్డులు, ఇతర సమస్యల గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దానికి కమిషనర్ సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరలోనే సమస్యలను పరిష్కరించే దిశగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, దాస్, హరిరాం, పంపు మల్లేష్, ప్రేమానందం, ఆర్.యాదగిరి, రాము, మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీల లో పనిచేసిన 13 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు.

పదవీ విరమణ పొందిన వారి వివరాలు:

వినయ్ కపూర్, జాయింట్ కమిషనర్ (లీగల్), పి.ప్రకాశం ఈఈ ఇంజనీరింగ్ విభాగం, బి.నర్సింగ్ రావు, ఏసిపి (టౌన్ ప్లానింగ్ విభాగం), వి.మాధురి, ఏ.ఎం.సి (లైసెన్స్ విభాగం), కె.వెంకట్ రెడ్డి, గేమ్స్ ఇన్ స్పెక్టర్ (స్పోర్ట్స్), ఇంజనీరింగ్ విభాగంలో ఎం.డి అహ్మద్ మాన్ మజ్దూర్, ప్రకాష్, ఆఫీస్ సబార్డినేట్, హెల్త్ విభాగంలో పి.వెంకటయ్య, శానిటరీ జవాన్, కె. రాజు, కామాటి, పి.గజేందర్ బాబు, పి.హెచ్ వర్కర్, కామాటన్ లు పద్మ, యాదమ్మ, కె. వెంకటేశ్వర్ కామాటి, ట్యాక్స్ విభాగం. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఫలితాల్లో ప్రభంజనం బుధవారం ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మల్కాజ్గిరి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు 15 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు కె.కళ్యాణ్ 538/100, ఇక్రా తబుస్సుమ్ 526/100, మార్కులు సాధించారు ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. మంచాల శ్రీనివాస్ ప్రధాన ఉపాధ్యాయులు హారిక వారి తల్లిదండ్రులను విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆరాంఘర్ ఫ్లైఓవర్ అప్ డౌన్ ర్యాంప్‌ల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్, శాస్త్రి పురం ఆర్.ఓ.బి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.ఓ.బి రైల్వే పోర్షన్ పెండింగ్‌లో ఉందని ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. రైల్వే పోర్షన్ ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని, రైల్వే పోర్షన్ పూర్తయిన తర్వాత పూర్తి పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని ప్రాజెక్ట్ అధికారులను అడిగారు. రైల్వే పోర్షన్ పనులు పూర్తయిన తర్వాత 30 నుండి 45 రోజుల్లో ప్రాజెక్ట్ మొత్తం పనులు పూర్తవుతుందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. రైల్వే సిఈతో సమన్వయం చేసుకుని వీలైనంత తొందరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కమీషనర్ ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో చార్మినార్‌ను పర్యాటకులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న, ప్రాజెక్టు ఈ ఈ బిఎల్ శ్రీనివాస్, డిప్యూటీ కమీషనర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్, కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె.రామకృష్ణారావును సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ బుధవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. కె.రామకృష్ణారావు ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉంటూ సింగరేణి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఒకరిగా సంస్థ అభివృద్ధికి ఎంతగానో సహకరించారని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు

జె.సోనియ 579/600 | డొడ్ల శరణ్య 571/600 | సి.హెచ్. త్రివేణి 572/600 | వి.హారిక 560/600

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు తమ చాటారు. మూసాపేట్‌లోని జెడ్.పిహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో చదివే విద్యార్థిని జె. సోనియా 579/600, సిహెచ్ త్రివేణి 572/600, జడ్పిహెచ్ఎస్ మూసాపేట్ గర్ల్స్ కూకట్పల్లి మండలంలో చదివే చెందిన విద్యార్థి 560/600, మార్కులు సాధించారు. జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో చదివే డొడ్ల శరణ్య 571/600 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. శరణ్య గణితంలో 98 మార్కులు సాధించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామారని చెందిన తండ్రి రాములు గౌడ్, తల్లి సుజాత కూతురు శరణ్య. తండ్రి పుల్లారెడ్డి కళాశాలలో వంట మాస్టర్‌గా పని చేస్తుంటారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సత్తా ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రంగారెడ్డి కలెక్టరేటులో నాగరాజు పదవీ విరమణ

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎంప్లాయిమెంట్ డిపార్ట్మెంట్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా జి.నాగరాజు, సుదీర్ఘ సేవలందించి పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ సన్మానోత్సవ శుభ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నాలుగో తరగతి ఉద్యోగులందరి ఆయన్ను సన్మానించారు. పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ లోని టీ జి ఐ ఆర్ డి కార్యాలయంలో రాజేంద్రనగర్ మండలంలోని కల్యాణలక్ష్మి షాదిముబారక్ లబ్దిదారులకు 462 మంది కల్యాణలక్ష్మి 102 మందికి 564 చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాలు ఎంతోగానో లబ్ధిచేకూరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ వెంకట్ రెడ్డి తహసీల్దార్ బొమ్మ రాములు నాయబ్ తహసీల్దార్ క్రాంతి కుమార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో సారథి పోర్టల్‌ను, ఆధునీకరించి తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అగ్నివీర్‌లకు లైసెన్స్‌లతో పాటు హెల్మెట్‌లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున రవాణా శాఖను కేంద్రం రాష్ట్రం కలిసి నడుపుతాయని, దేశంలో పరివాహన్ సారథి అనే పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దేశంలో ఇప్పటికే 28 రాష్ట్రాలు సారధిను అమలు చేస్తున్నాయని, గతంలో సారథి పోర్టల్ ను ఎప్పుడో అమలు చేయాల్సిండగా ఆలస్యం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తరువాత సారథి పోర్టల్ పై నిర్ణయం తీసుకొని ప్రారంభించుకోవడం జరిగింద న్నారు. భారతదేశ రవాణా చట్టానికి సంబంధించిన సమాచారం లోపల మనం కూడా అంతర్భాగం అయ్యామని, దేశ వ్యాప్తంగా రవాణా పరమైన మార్పులు నిర్ణయాలు వాహనాల సమాచారం, రవాణా శాఖకు సంబంధించిన మొత్తం సమాచారం మన దగ్గర తెలుసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో తెలంగాణకి వాహన సారథి సభ్యులుగా చేరడం వల్ల రవాణా అంశాల్లో దేశంలో భాగస్వామ్యులం అయ్యామన్నారు. ప్రతి రోజు కనీసం 20 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వందలాది మంది వైకల్యం పొందుతు న్నారు. ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. రోడ్డు మాసోత్సవాలు ద్వారా రోడ్డు భద్రత కార్యక్ర మాలు చేపట్టామని తెలియజేసారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రాణాలు కాపాడేలా స్కూల్ స్థాయి నుండి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రవాణా శాఖ రూల్స్ పట్ల ఆవాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టామని, పిల్లలు ఇప్పటి నుండే చెప్పకపోతే తరువాత అవగాహన కల్పించలేమని, రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పాఠశాలలో స్కూల్ ట్రాఫిక్ అవగాహన పార్క్ ఏర్పాటు చేస్తున్నారు. మారుతున్న సాంకేతిక విప్లవంలో రోడ్ నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ లు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్ మరో ఢిల్లీ కావద్దని అక్కడ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, దేశంలోనే మొదటి ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. ఈవి వాహనాలకు జీరో టాక్స్ చేశామని, వందల కోట్లు నష్టం వచ్చిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఇబ్బంది కలగద్దని ఈవీ పాలసీ తీసుకొచ్చామని వివరించారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలపై స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామన్నారు. ప్రజల సహకారం లేకపోతే ఏది సాధ్యంకాదని, రవాణా నిబంధనలు పాటిస్తూ మనం సురక్షితంగా ఇంటికి వెళ్లేలా రవాణా నిబంధనలు పాటించాలని, రవాణా శాఖ సేవలు ఆన్లైన్ అందించడం ద్వారా మధ్యవర్తి లేకుండ పారదర్శకంగా అందిస్తుందన్నారు. రవాణా శాఖ ఆర్టీసీలో ఉచితంగా బస్సు సౌకర్యం అందిస్తున్నామని, రోడ్డు ప్రమాదాల రహిత తెలంగాణగా మారుస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, కంటోన్మెంట్ సీఈవో ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూతన సిఎస్ రామకృష్ణారావును సన్మానించిన రాచాల

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. బుదవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సుదీర్ఘకాలం విశేష సేవలందించిన రామకృష్ణారావును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, తనకున్న అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి సలహాదారు బడేసాబ్, సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ గాలిగల్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కల్పించిన మొదటి గురువు బసవేశ్వర : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజంలో ఉన్న అనేక మూఢాచారాలను పారద్రోలి కులమత రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషిచేసిన ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ బసవేశ్వర అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మహాత్మా శ్రీ బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద శ్రీ బసవేశ్వర విగ్రహానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌తో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో సమాజం మీద అవగాహన కల్పించిన మొదటి గురువు బసవేశ్వరుడు అని, బసవేశ్వరుడు జగత్ గురువుగా వారు చూపిన మార్గంలో నడుస్తూ సర్వేజనా సుఖినోభవంతు అందరూ బాగుండాలని, అందరూ పరస్పరం గౌరవించుకుంటూ వారు ఇచ్చిన శాంతి సందేశం పాటించినట్లయితే ఎక్కడ ఉద్రిక్త వాతావరణలు ఉండదన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్,బిసి సంక్షేమ శాఖ ఎం చంద్రశేఖర్, ఉప సంచాలకులు జి ఆశన్న, లింగాయతుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్సీలో అద్భుత ఫలితాలు సాధించిన ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఎస్ఎస్సీలో ఆక్స్ ఫర్డ్ పాఠశాల పాస్ శాతం 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. జి.సిద్ధార్థ మొత్తం 10 జిపిఎ స్కోరు చేశాడు. 6 మంది విద్యార్థులు 90 శాతం, అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు.25 మంది విద్యార్థులు 80 నుండి 90 శాతం మధ్య గ్రేడ్లు సాధించారు. పాఠశాల మొత్తం అభివృద్ధిపై దృష్టి సారించే విద్యార్థుల దిశ, నైపుణ్యం కలిగిన అమలు, సాంకేతిక నైపుణ్యాల మెరుగుదల, హాజరులో క్రమశిక్షణ, జీవిత శాస్త్రాలు, లలిత కళలు, క్రీడలు ఆటల అధిక ఉద్దేశ్యాల ఫలితం అని వైస్ చైర్ పర్సన్ ప్రార్థన మానికొండ అన్నారు. వ్యక్తిగతంగా విద్యార్థులను పర్యవేక్షించి ఉపాధ్యాయులు ప్రోత్సహించారనీ అన్నారు. కరస్పాండెంట్ ప్రభాకర్ విద్యార్థులకు ఎల్లప్పుడూ సకాలంలో మద్దతు ఇస్తూ మార్గనిర్దేశం చేశారు. డీన్ రామస్వలా ఎప్పటికప్పుడు విద్యార్థుల పురోగతిని పర్యవేక్షించారు. హెడ్ మాస్టర్ ఫహ్మిదా తరగతులను సూక్ష్మంగా పర్యవేక్షించారనీ, అంతటా విద్యార్థులకు మద్దతు ఇచ్చారనీ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పని అంకితభావం తమ విద్యావ్యవస్థకు వెన్నెముక అన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు.బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 - జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని క్రితుంగ రెస్టారెంట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్ప్రింట్ డయాగ్నస్టిక్స్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ వైద్యరంగంలో రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక మార్పులతో "రోగ నిర్ధారణ, రోగానికి చికిత్స" అందించడంలో స్ప్రింట్ డయాగ్నొస్టిక్ అత్యుత్తమ సేవలు అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. పేదలకు తక్కువ ధరకు వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో 2021 సంవత్సరంలో డాక్టర్ భరత్ రెడ్డి స్థాపించబడిన "స్ప్రింట్ డయాగ్నస్టిక్స్" అతితక్కువ కాలంలో 7వ శాఖను సుచిత్రలో ఏర్పాటుచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింతగా విస్తరించాలని తెలిపారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం ఎమ్మెల్యే కేపీ వివేకానందాన్ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఆర్ పౌల్ట్రీ ఫామ్స్ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి, స్ప్రింట్ డయాగ్నొస్టిక్ ఎండి డాక్టర్ భరత్ రెడ్డి, డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, యేసు, నదీమ్ రాయ్, విజయ్ హారీష్, స్ప్రింట్ డయాగ్నొస్టిక్ సీఓవో తరుణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం పేదల పాలిట గొప్ప వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొందుర్గ్‌లో రైతు వేదిక వద్ద, చౌదర్ గూడెం రైతు వేదిక మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ భూ వివాదల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూభారతి చట్టం అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదారని చెప్పారు. భూమి రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ, భూధాన్, అసైన్డ్, దేవాదాయ, భూములను ఎవరైనా పట్టా చేసుకుంటే వాటిని రద్దు చేసేలా సిసిఎల్ఏ కి అధికారాలు ఉంటాయన్నారు. కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ తెచ్చమని, ఎవరి భూమి అయిన వేరే వాళ్ళకు తప్పుగా నమోదైతే ఎమ్మార్వో, ఆర్డీవో, జేసీ, కలెక్టర్‌కు అప్పీలు చేసుకొని పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోని అందుతాయ న్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రజలకు అన్ని సేవలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. ధరణి వల్ల రైతులు భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలన్ని టీకీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్ఓఆర్ చట్టం భూభారతితో సులభంగా పరిష్కారం అవుతుంద న్నారు. ధరణి రిజిస్ట్రేషన్‌లో పొరపాటు జరిగిన సరిదిద్దుకునే అవకాశం ఉండేది కాదని రైతులు, పేదలు కోట్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. ధరణి అన్నదమ్ములు, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం మొత్తం పారదర్శకంగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, ఇబ్రహీం, చంద్రశేఖర్, రాజా రత్నం, గోవర్ధన్ గౌడ్ పురుషోత్తం రెడ్డి, గోపాల్, రాముల గౌడ్, యాదయ్య, ఆంజనేయులు, రాజు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూదాన భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గత పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన భూదాన భూముల అన్యాక్రాంతం, అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కోరారు. భూదాన భూముల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని అన్యాక్రాంతమైన భూదాన భూములను పరిరక్షించాలని, తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి రెండేళ్లలో భూముల పంపిణీని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూదాన భూముల పరిరక్షణ కోసం ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, చేపట్టిన చర్యలను అఖిల భారత సర్వ సేవ సంఘ్, అఖిల భారత సర్వోద య మండలి స్వాగతిస్తుందన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు తొలుపునూరి కృష్ణా గౌడ్, వెదిరె రామచంద్రారెడ్డి కుమారులు వెదిరె ప్రమోతిష్ చంద్రారెడ్డి, వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి, భూదాన రామచంద్రారెడ్డి సేవా సంఘ్ నాయకులు దానయ్య, ఎం.రాజు, శ్రీమంతగిరి నరేష్ గౌడ్, భూదాన పోచంపల్లి భూదాన గ్రహీతలతో కలసి మహాదేవ్ విద్రోహి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వానికి ఫోర్జరీ పత్రాలు సమర్పించిన కారణంగా భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్‌గా నియమించబడిన గున్న రాజేందర్‌రెడ్డిని 2015లో అప్పటి ప్రభుత్వం భర్తరఫ్ చేసిందని, దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లగా కోర్టు కూడా ఆయన భర్తరఫ్ సరైందేనని తీర్పు చెప్పిందని, గున్న రాజేందర్ రెడ్డి హయాం లో జరిగిన భూదాన భూముల అక్రమాలకు సంబంధించిన కేసులను విచారించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిం దన్నారు. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన పేదలు భూమి హీనులు దళితులు, రైతు కూలీలకు ఉపాధి కోసం ఉద్దేశించిన భూదాన ఉద్యమం ప్రారంభమైన తెలంగాణలోనే దేశమంతా వేలెత్తి చూపే విధంగా భూదాన భూముల కుంభకోణాలు జరగడం, అన్యాక్రాంతం జరగడం విచారకరమ న్నారు. వేల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగినట్లు మీడియాలో వస్తున్న వార్తల ఆధారంగా తెలుస్తోం దన్నారు. దేశవ్యాప్తంగా బోధన భూముల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టులో కూడా పిటీషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. పేదలకు నివాసం, ఉపాధి కోసం ఉద్దేశించిన భూదాన భూములను పారిశ్రామికవేత్తలకు, బడా కంపెనీ లకు ఇవ్వడం అన్యాయమన్నారు. భూదాన భూములు ప్రభుత్వ భూములు కావని అవి పేదలకు చెందినవని ఇటీవల హైకోర్టు తీర్పుని వ్వడం హర్షనీయమన్నారు. హైకోర్టు తీర్పు గతం లో 'ధరణి'లో ప్రభుత్వ భూములని చూపిన భూదాన భూములను ప్రస్తుతం 'భూ భారతి'లో భూములుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ వద్ద బీజేపీ ధర్నా

విశాలాంధ్ర - కాప్రా : చర్లపల్లి రైల్వే టెర్మినల్ వద్ద మౌలిక వసతులు కల్పించాలని, ట్రాఫిక్ సమస్యలు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, భారత ప్రభుత్వం 450 కోట్ల వ్యయంలో చర్లపల్లి టెర్మినల్ నిర్మించి, నాలుగు నెలల పూర్తయినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్నినల్ ప్రారంభించినా, ఇప్పటివరకు కనీస వసతులు కల్పించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రోడ్లు, వీధి దీపాలు, బస్సు సౌకర్యం వంటి కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన వసతులను 15 రోజుల్లోగా కల్పించకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్ గౌడ్, నాదం. బాలచందర్, కొమ్ము నరసింహారావు, చెల్లా ప్రభాకర్, ఆనంద్ గౌడ్, పోతగాని గోపాల్ గౌడ్ రాంప్రదీప్, అంజనేయులుతో పాటు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఆలోచన చేయడం మానేసి స్వయం ఉపాధి వైపు యువత మొగ్గు చూపాలని ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందవచ్చునని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మండలంలోని హిమాయత్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్రకాయల రమేష్ ముదిరాజ్ చిలుకూరు రెవెన్యూ పరిధిలో నూతనంగా లాండ్రీ (డ్రైక్లినింగ్) దుకాణాన్ని ఏర్పాటు చేయగా స్పీకర్ బుధవారం సాయంత్రం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో కృషి చేస్తోందని.. అందుకు ఉదాహరణ రాజీవ్ యువ వికాస్ పథకామని తెలిపారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని కాకుండా మనం స్వయం ఉపాధితో ముందుకు వెళ్తే ఆర్థికంగా బలోపేతమైతామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీంభరత్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య తదితరులు పాల్గోన్నారు.

భూ భారతి చట్టంతో భూ సమస్యలన్నీ పరిష్కారం

విశాలంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్‌లోని టీజిఐఆర్‌డి ఆడిటోరియంలో బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు ఆధ్వర్యంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ధరణితో రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారు అని భూ భారతీతో సమస్యలు పరిష్కారం అవుతాయి అని భూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే విదంగా భూ భారతి పనిచేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్ ఆర్‌డిఓ వెంకటరెడ్డి తహసీల్దార్ బొమ్మ రాములు వ్యవసాయ అధికారి కవిత నాయబ్ తహసీల్దార్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

విశాలాంధ్ర - కాప్రా : వీరశైవుల ఆరాధ్య గురువు మహాత్మా బసవేశ్వర 892వ జయంతి పురస్కరించు కొని బుధవారం కాప్రా సర్కిల్ మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ పరిధిలోని మహాత్మా బసవేశ్వర విగ్రహం వద్ద ఉప్పల్ మాజీ శాసన సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు బేతి సుభాష్ రెడ్డి, కాప్రా వీరశైవ సమాజం అధ్యక్షులు యావపురం విశ్వనాథం, అధ్యక్షులు పేట జ్ఞానేశ్వర్ కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, కోశాధికారి కత్తి శివానంద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 11వ శతాబ్దంలో సమాజంలోని అసమానతల పై పోరాడి సమాజంలో అంతా సమానమే అని పోరాడారన్నారు. జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ నెంబర్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, నాయ కులు కొత్త అంజిరెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, రాములు యాదవ్, రమేష్ యాదవ్, రాంప్రదీప్, బంగి లక్ష్మణ్, మహేష్, సిసిఎస్ పద్మారెడ్డి, గంప కృష్ణ, వంజరి ప్రవీణ్, దేశాయి బండి గౌడ, ఉల్లం బాల్రాజ్, సిద్దేశ్వర్, శివ, శంభు లింగం పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తా

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన ద్యేయంగా పనిచేస్తానని మాజీ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17 డివిజన్ కౌసల్య కాలనీలో మన్విత గోకులం అపార్టుమెంట్ ఆవరణలో మ్యాన్ హోల్ చుట్టూ రోడ్డు కొట్టుకుపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ ఆగంరాజు హుటాహుటిన అక్కడకు చేరుకొని రెడీమిక్స్‌ను వేయించారు. ఈ సందర్భంగా ఆగంరాజు మాట్లాడుతూ గడిచిన రోజుల్లో డివిజన్ అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అలాగే డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పడికప్పుడూ పరిష్కరించామని, రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ అధ్యక్షులు బద్రి, లక్ష్మినారాయణ స్థానికులు పాల్గొన్నారు.

అరోరా డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం, పర్వతాపూర్ శివారు ప్రాంతంలో ఉన్న అరోరా డీమ్డ్ విశ్వవిద్యాలయ ఎంబీఏ, ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పదిరోజులుగా విశ్వవిద్యాలయం మధ్యంతరంగా తీసుకొచ్చిన పరీక్ష షెడ్యూల్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బుధవారం ఉదయం ఆందోళన నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ అరోరా విశ్వవిద్యాలయంలో 2023వ సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు దాదాపు 240 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం జరిగింది. అడ్మిషన్ తీసుకునే ముందు కేవలం కోర్స్‌కి సంబంధించిన పరీక్షలు మాత్రమే నిర్వహిస్తాం. ఇతర ఎటువంటి పరీక్షలు కానీ ఫీజులు కానీ ఉండవు అని విశ్వవిద్యాలయ యాజమాన్యం తెలియజేయడం జరిగింది. కానీ ఇంకో 4 నెలల వ్యవధిలో కోర్స్ పూర్తి కావస్తున్న తరుణంలో అర్థాంతరంగా ఇతర పరీక్షలు రాయాలని, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మేము విధించిన పరీక్షలు రాయకపోతే మిమ్మల్ని ఫెయిల్ చేస్తామని విశ్వవిద్యాలయ యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయంలో విశ్వవిద్యాలయ యాజమాన్యం మొండి వైఖరికి పోకుండా విద్యార్థులకు న్యాయం చేసే విధంగా చర్యలు తెసుకోవాలని, అడ్మిషన్ తీసుకునే ముందు మీరు చెప్పిన మాట ప్రకారం పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు విలువైన భవిష్యత్తు కాపాడాలని, వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేని యెడల విద్యార్థులను న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటూ.. పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు ఆదిత్య, జెక్క సాయి, ఆకాష్, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

హోదా కోసం పట్టుపట్టండి

చంద్రబాబు, పవన్‌కు నారాయణ హితవు

విశాలాంధ్ర-గూడూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ చూపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. గూడూరు పట్టణంలో బుధవారం నారాయణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ పర్యటన కోసం టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, మంత్రులు విజయవాడ చుట్టూ చకోరి పక్షుల్లా నిరీక్షిస్తున్నారని నారాయణ విమర్శించారు. పదేళ్ల క్రితం మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి శ్మశానంలా మారిందని తెలిపారు. మోదీ దగ్గర చంద్రబాబు కన్నా పవన్ కల్యాణ్‌కు ప్రాధాన్యత ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. నాడు అమరావతి కోసం మోదీ చెంబుడు నీరు, మట్టి తెచ్చి...చంద్రబాబును సంతృప్తి పరిచారన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా ఇస్తే మోదీని భిక్షం అడగాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా విషయంలో మోదీని చంద్రబాబు ఎందుకు ప్రశ్నించడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నారాయణ విమర్శించారు. వేలమంది పర్యాటకులు ఉన్న ప్రాంతంలో కనీసం ఒక్క జవాను కూడా ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ భద్రతా వైఫల్యమేనన్నారు. ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజే మోదీ బీహార్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొన్నారని, ఇది కేవలం ఎన్నికల ప్రచార సభ మాత్రమేనని అన్నారు. సింధు జలాలను పాక్‌కు వెళ్లకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకోలేదన్నారు. టెర్రరిజం అణచివేతకు సంబంధించి మోదీ ప్రభుత్వానికి సీపీఐ పూర్తి మద్దతు తెలిపిందని గుర్తుచేశారు. రాష్ట్ర రాజకీయాలను ప్రస్తావిస్తూ...వైసీపీ ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ చేసిన వారే... టీడీపీ ప్రభుత్వం లోనూ కొనసాగిస్తున్నారని నారాయణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ చిల్లకూరు మండలం క్రిస్ సిటీ సెజ్‌లో భూములను ప్రభుత్వం సర్వే చేసిందన్నారు. 267 ఎకరాలు సాగుబడిలో ఉన్న రైతులకు ఎలాంటి పత్రాలు లేవనే సాకుతో అధికారులు నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం చేతికి వచ్చిన పంటలను అధికారులు ధ్వంసం చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు సైతం చెప్పిందని గుర్తుచేశారు. ప్రతి రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, శశికుమార్, కాలేషా, రమేశ్, నారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.

యుద్ధం పరిష్కారం కాదు

సీపీఐ ఎంపీ సంతోశ్‌కుమార్

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై కేంద్రప్రభుత్వం చేస్తున్న పోరాటానికి పూర్తి అండగా నిలుస్తామని...అదే సమయంలో యుద్ధం సమస్యకు పరిష్కారం కాదని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడి ఘటనకు ప్రతిస్పందనపై నిర్ణయం తీసుకోవడానికి సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో సంతోశ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వానికి తాము అండగా నిలుస్తున్నామన్నారు. అయితే యుద్ధం పరిష్కారం కాకపోవచ్చునని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ప్రకటన గురించి ప్రశ్నించగా... "సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి మేము భారత ప్రభుత్వానికి అండగా నిలుస్తాం. మేము పూర్తి మద్దతు కూడా అందించాం. అంతేకాకుండా (పహల్గాం దాడిపై చర్చించడానికి) పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మేము డిమాండ్ చేశాం" అని చెప్పారు. అయితే సమాజాన్ని విభజించడానికి ఉగ్రవాద దాడిని సాకుగా తీసుకోరాదని కూడా ఆయన అన్నారు. పహల్గాం సంఘటన తర్వాత సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్న అనేక అంశాలు మనం చూస్తున్నామని సంతోశ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. 'రాజకీయ జ్ఞానం పాలకులందరికీ మార్గదర్శక శక్తిగా ఉండాలి. సైనికచర్య పరిష్కారం కాదు. ఒకవైపు ఉక్రెయిన్-రష్యా యుద్ధం... మరోవైపు గాజా... ఇవి అంతులేని దుఃఖాలు. ఈ సమస్యలను పరిష్కరించడానికి యుద్ధం ఒక ఎంపిక అని నేను అనుకోను' అని సంతోశ్ స్పష్టం చేశారు.

భక్తుల మరణాలపై సమగ్ర విచారణ: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ జిల్లా సింహాచలంలో భక్తులు మరణించిన దుర్ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడకూలి ఏడుగురు మృతి చెందటం బాధాకరమని తెలిపారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని, బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ముగిసిన ఏపీ పాలిసెట్ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పాలిసెట్ 2025 పరీక్ష బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఈ పరీక్షకు 1,57,482 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా... వారిలో 84,961 మంది బాలురు (90 శాతం), 54,970 మంది బాలికలు (87 శాతం) పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. అనకాపల్లి, విశాఖపట్నంలో 94 శాతం మంది హాజరయ్యారు. రాష్ట్రంలోని 430 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మే 2వ తేదీన ఏపీ పాలిసెట్ ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు.

యువతకు 'స్కిల్'

- రెండు లక్షల మంది విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి లక్ష్యం
- మంత్రి లోకేశ్ సమక్షంలో యునిసెఫ్‌తో ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు సాధికారత కల్పించేందుకు యునిసెఫ్ తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, యునిసెఫ్ 3 ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ, యునిసెఫ్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యునిసెఫ్, ఏపీఎస్ఎస్ డీసీ పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్, యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమాలను అమలుచేయనున్నారు. ఇంటికో వ్యాపారవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఇవి ఎంతగానో తోడ్పాటును అందించనున్నాయి. యువతలో నవీన ఆవిష్కరణలు, ఇంక్లూజన్, స్థిర జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నాయి. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ సృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. యూత్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 సంవత్సరాల మధ్యగల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, యునిసెఫ్ ఏపీ, కర్నాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ సీఎఫ్‌వో జిలాలిమ్ బిర్హాను టఫెస్సే, ఫీల్డ్ ఆఫీస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీకృష్ణ మదమంచి, యూనిసెఫ్ ఇండియా అడాలసెంట్ అండ్ యూత్ డెవలప్ మెంట్ స్పెషలిస్ట్ మానస ప్రియా వాసుదేవన్, స్టాక్ హెూల్మ్ డిజిటల్, ఏఐ, స్ట్రాటజీ, ఆఫీస్ ఆఫ్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్ రవితేజ బాలే, ఏపీ కర్నాటక, తెలంగాణ యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్స్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భద్రతా సలహా బోర్డు పునరుద్ధరణ

- చైర్మన్ అలోక్ జోషి, మరో ఆరుగురు సభ్యులు
- పాక్‌తో ఉద్రిక్తతల వేళ కేంద్రం నిర్ణయం
- ప్రధాని అధ్యక్షతన సీసీఎస్, సీసీపీఏ, సీసీఈఏ భేటీలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాతున్న వేళ జాతీయ భద్రతా సలహా బోర్డును పునరుద్ధరిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. బోర్డు చైర్మన్‌గా రా మాజీ అధిపతి అలోక్ జోషీని నియమించింది. ఏడుగురితో ఏర్పాటు చేసిన ఈ బోర్డులో విశ్రాంత మిలిటరీ, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఉన్నారు. బోర్డు సభ్యులుగా పీఎం సిన్హా, ఏకే సింగ్, మోంటీ ఖన్నా, మాజీ ఐపిఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బి.వెంకటేశ్ వర్మలకు చోటు కల్పించింది. పహల్గాం ఉగ్రదాడికి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక సమావేశాలు నిర్వహించారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ), ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశాలు జరిగాయి. పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హెూంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

కాగా పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు ఘాతుకానికి తెగబడిన తర్వాత రెండోసారి సీసీఎస్ సమావేశం జరిగింది. అంతకుముందు ఏప్రిల్ 23న ఓసారి జరిగింది. జమ్మూకశ్మీర్‌లో విజయంతంగా ఎన్నికలు నిర్వహించడం, అక్కడ అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, స్థిరమైన పురోగతిని ఓర్వలేకే ముష్కరులు పహల్గాంలో రెచ్చిపోయారని ప్రధాని అభిప్రాయపడ్డారు.

ఆ తర్వాత పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇస్తుందని, సింధూ జలాల ఒప్పందాల రద్దు సహా పలు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం కీలక భద్రత సమావేశం అనంతరం ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రధాని ప్రకటించిన సంగతి విదితమే.

సూపర్ కేబినెట్

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ కేబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హెూదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, పాక్‌కు గట్టి సమాధానం ఇచ్చింది.

కాంగ్రెస్, బీజేపీ బాహాబాహీ

- పీసీసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- అమరావతిపై మోదీ తీరుకు షర్మిల నిరసన
- కోడిగుడ్లు, టమాటాలతో బీజేపీ శ్రేణుల దాడులు
- రాష్ట్ర అధ్యక్షురాలు అరెస్టు... గన్నవరం తరలింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లోని పీసీసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. పీసీసీ కార్యాలయానికి బీజేపీ నేతలు దూసుకురావడంతో హైటెన్షన్ నెలకొంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన మంత్రి మోదీపై కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన తీవ్ర వ్యాఖ్యల్ని కమలం పార్టీ నేతలు తప్పుబట్టారు. 'మోదీ... ఈ సారైనా అమరావతి కట్టేనా... లేక మళ్లీ మట్టేనా' అంటూ ప్లకార్డులతో కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న బీజేపీ నేతలు... అక్కడకు చేరుకుని ఆమెకు వ్యతిరేకంగా నినదించారు. మోదీపై చేసిన వ్యాఖ్యలకు షర్మిల క్షమాపణ చెప్పాలంటూ నినదించారు. కాంగ్రెస్ నేతలు ప్రతినినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా బీజేపీ నేతలు కాంగ్రెస్ కార్యాలయంపై టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బీజేపీ కార్యాకర్తలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రరత్నభవన్ గేట్ వద్ద పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగారు. పరిస్థితి అదుపు తప్పుతున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగి...ఇరు వర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ కార్యాలయంలోకి వెళ్లబోయిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో షర్మిలను హౌస్ బయటకు రాకుండా నిర్బంధించారు. పోలీసుల తీరుపై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల కనుసన్నల్లోనే బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారని మండిపడ్డారు. పోలీసులు షర్మిలను అరెస్టు చేసి గన్నవరం దగ్గర గల ఆమె నివాసానికి తరలించారు.

చెల్లి పెళ్లి మళ్లీమళ్లీ అన్నట్లుగా అమరావతికి శంకుస్థాపన: షర్మిల

చెల్లి పెళ్లి మళ్లీమళ్లీ అన్న చందంగా అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన ఉందని షర్మిల ఎద్దేవాచేశారు. పదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా చేశారని, టీడీపీ, వైసీపీలు మోదీకి బానిసలుగా పనిచేశారన్నారు. 2015లో మోదీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేశారని, అట్టహాసంగా శిలాఫలకం వేశారని, ఇప్పుడు అక్కడ చెట్లు,పుట్టలు తప్పా ఏమి లేవన్నారు. వచ్చేటప్పుడు మోదీ పార్లమెంట్ మట్టి, యమునా నీళ్లు తెచ్చారని చెప్పారు. నాడు దిల్లీని తలదన్నే రాజధానిని కడతామని మోదీ హామీ ఇచ్చారని, పదేళ్లల్లో మోదీ ఇచ్చింది... మట్టి మాత్రమేనన్నారు. రాజధానిపై గ్రాఫిక్స్ చూపించారని, సింగపూర్, మలేషియా అన్నారని ధ్వజమెత్తారు. మూడు ముక్కలాట లెక్క జగన్ మూడు రాజధానుల ఆటాడారని, ఆనాడు మోదీ ప్రధాని... ఇక్కడ సీఎం చంద్రబాబేనని, ఇప్పుడు కొత్తేమి ఉందని ఎద్దేవా చేశారు.

రాజధానికి కావాల్సింది మట్టి, నీళ్లు కాదని, రాజధాని నిర్మాణానికి కనీసం రూ.రెండు లక్షల కోట్లు కావాలన్నారు. అప్పులు కాకుండా పూర్తిస్థాయి నిధులు వెంటనే ఇవ్వాలన్నారు. వచ్చే మూడేళ్లలో రాజధానిని నిర్మించాలని చెప్పారు. బీజేపీ నాయకులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని, పదకొండేళ్లుగా రాష్ట్రాన్ని మోదీ నాశనం చేశారని షర్మిల ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు ఎలాగూ ప్రశ్నించబోరని, మోదీ పాలనపై నిలదీస్తే నాపై దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయం లోపలకు వచ్చారంటే పోలీసులు సహకారం లేకుండా వస్తారా అని నిలదీశారు. ఎవరైతే దాడిలో ఉన్నారో అందరి పైనా హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. మీ అన్యాయాలను ప్రశ్నిస్తూ మోసాలు బయట పెడితే దాడి చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు... ఇదేనా మీ పాలనలో మహిళలకు జరిగే న్యాయం, ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలి

మోదీ పర్యటనపై జంగాల



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ఆర్థిక ప్రయోజనం కలిగించేలా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మించకున్నా... మంచి రాజధాని నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున హంగామా చేస్తుందని, గతంలోనూ ఇలాగే రాజధాని ప్రాంతానికి మోదీ వచ్చారని, రాజధాని నిర్మాణ కల నెరవేరుతుందని అందరూ భావించారని, కానీ అలా జరగలేదని గుర్తుచేశారు. రాజధాని నిర్మాణానికి మోదీ ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. చంద్రబాబు అధికారం కోల్పోయి... జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మరుక్షణం రాజధానిని నిర్వీర్యం చేసే పద్ధతిలో మూడు రాజధానుల పల్లవి అందుకుంటే... మోదీ మౌనం వహించారన్నారు. ఎక్కడైతే రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారో... ఆ శిలాఫలకం చుట్టూ అడవి తయారైందని, ఈ విషయంపై అమరావతి రైతులు, రైతు కూలీలు, ప్రజలు, వైసీపీయేతర రాజకీయ పార్టీలు పెద్దఎత్తున ఆందోళనలు చేసినా మోదీ చెవిని తాకలేదని జంగాల విమర్శించారు. తాజాగా మోదీ పర్యటన సందర్భంగా అమరావతి రాజధానికి సరిపడా నిధులు కేటాయించాలని, విశాఖ రైల్వే జోన్‌కు తోడ్పాటు అందించాలని, కడపలో స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు పూనుకోవాలని కోరారు.

'సింహాచలం' మృతులకు రూ.కోటి పరిహారం ఇవ్వండి

జగన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ, సింహాచలంలోని ఆలయం వద్ద గోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురి సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంపై వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాడు తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోతే తాజా ఘటనలో ఏడుగురు చనిపోయారని, ఆలయాలకు వచ్చే భక్తుల కోసం కనీస వసతులు కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'పదడుగుల ఎత్తు, డెబ్భై అడుగుల పొడవుతో గోడ కట్టారు. టెండర్లు లేకుండా నిర్మాణం పూర్తి చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నాగానీ చందనోత్సవం ఎప్పుడు జరుగుతుందో ముఖ్యమంత్రికి తెలియదా? తెలిసి కూడా నిర్లక్ష్యం చేశారా? ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు? ఏర్పాట్ల విషయంలో మంత్రుల కమిటీ చేసినదేమిటి?' అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట పూర్తి అయిన గోడ పక్కనే క్యూలైన్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాల కోసమే తిరుమల లడ్డూ వివాదం సృష్టించారని విమర్శించారు. 'తిరుమల గోశాలలో గోవులు చనిపోయాయని, కాశినాయన గుడిని బుల్డోజర్లతో కూల్చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం ఆలయంలో తాబేళ్లు మృతి చెందాయి. అంతకు ముందు గోదావరి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత మంది చనిపోయినా బాధ్యత తీసుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ... మాపైకి నెపం నెట్టే ప్రయత్నాన్నే చేశారని జగన్ విమర్శించారు. చంద్రబాబులో పశ్చాత్తాపం లేదన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలకు భరోసా ఇచ్చేదిగా ఉండాలని సీఎంకు హితవు పలికారు. మొక్కుబడిగా రూ.25 లక్షల పరిహారం ప్రకటించారని, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని చంద్రబాబుకు సూచించారు. మృతుల కుటుంబాలను జగన్ పరామర్శించారు. తిరిగి అధికారంలోకి వచ్చాక ఆదుకుంటామని వారికి జగన్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, వాసుపల్లి గణేశ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వరుదు కళ్యాణి, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులగణన మా ఘనతే: లాలు

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుల గణన చేస్తామంటూ ప్రకటించడం ఇండియా ఐక్యసంఘటన అతి పెద్ద విజయంగా సంబంధిత పార్టీలు అభివర్ణిస్తున్నాయి. బీహార్‌లో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్ర నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. తదుపరి జనాభా గణనలో కుల గణాంకాలను చేర్చాలనే కేంద్రం తీసుకున్న నిర్ణయం తమ ఘనత అని ఆయన అన్నారు. '30 ఏళ్ల క్రితం సోషలిస్టులమైన మా ఆలోచనలు రిజర్వేషన్లు, కుల గణన, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం మొదలైనవి... ఇతరులు దశాబ్దాల తర్వాత అనుసరిస్తారు' అని లాలూ యాదవ్ చెప్పుకొచ్చారు. 'ఇది మాకు పెద్ద విజయం. ప్రధాని నరేంద్ర మోదీ కుల గణనను వ్యతిరేకించారు. కానీ కేంద్రం ఇప్పుడు మా ఎజెండాపై పని చేస్తోంది' అని ఆ పార్టీ సీనియర్ నేత తేజస్వీయాదవ్ అన్నారు. కాగా కుల సర్వే కాంగ్రెస్ పార్టీ కీలక డిమాండ్ అని కాంగ్రెస్ నేత విజయ్ వాడేట్టివార్ అన్నారు. 'కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఇది కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. మా నాయకుడు రాహుల్ గాంధీ దీనిపై ఎంతో కాలంగా పోరాడుతున్నారు' అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.